


అధినేతతో.. తాజా ఎమ్మెల్యేలు

టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడ్ని బుధవారం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో తాజాగా ఎన్నికైన ఎమ్మెల్యేలు మర్యాద పూర్వకంగా కలిశారు. నక్కా ఆనందబాబు, అనగాని సత్యప్రసాద్ జూలకంటి బ్రహ్మారెడ్డి, భాష్యం ప్రవీణ్ కలిశారు. లోకేశ్ ను ప్రత్తిపాటి పుల్లారావు, నరేంద్ర, నజీర్ అహ్మద్, భాష్యం ప్రవీణ్ కలిశారు.










విజేతలను ఊహించి విజేతలయ్యారు..

- ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో కూపన్ల డ్రా
- 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' విజేతలకు బహుమతులు
- తొలి విజేతకు రూ.10 వేలు, మరో ముగ్గురికి రూ.5 వేలు



లక్కీడిప్ డ్రాలో పాల్గొన్న ఆంధ్రజ్యోతి గుంటూరు డీజీఎం రామచంద్రరావు, ఎడిషన్ ఇన్‌చార్జి సాంబశివరావు, సర్క్యులేషన్ మేనేజర్ భాస్కరరెడ్డి, యాడ్ మేనేజర్ సుబ్బారావు తదితరులు

గుంటూరు, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీల గెలుపు, ఓటములపై విశ్లేషిస్తూ 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి జిల్లా స్థాయిలో నిర్వహించిన లక్కీడీప్ కూపన్ల డ్రా బుధవారం వెంగళాయపాలెంలోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో జరిగింది. నెలరోజుల నుంచి ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురితమైన కూపన్లలో ఎన్నికల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఎవరు గెలిచేది తెలియజేస్తూ ఊహించి పూర్తి చేసిన వారిలో అదృష్టవంతులను ఎంపిక చేశారు. గుంటూరు డీజీఎం సూదా రామచంద్రరావు, ఎడిషన్ ఇన్‌చార్జి సూర్యదేవర సాంబశివరావు, సర్క్యులేషన్ మేనేజర్ భాస్కరరెడ్డి, యాడ్స్ మేనేజర్ సుబ్బారావుల ఆధ్వర్యంలో కూపన్ల డ్రా కార్యక్రమం జరిగింది. ఇందులో మొదటి బహుమతిగా రూ.10 వేలను రేపల్లెకు చెందిన బోయిన ఉయ్యూరు గెలుచుకున్నారు. ద్వితీయ బహుమతిగా రూ.5 వేలను ఇచ్చేందుకు ముగ్గురిని ఎంపిక చేయగా వారిలో నరసరావుపేటకు చెందిన షేక్ మాబు సుభా ని, వినుకొండకు చెందిన మాదాల హైమారావు, పెద కాకాని మండలం ఉప్పలపాడుకు చెందిన మంచికల పూడి మదన మోహనరావు ఉన్నారు. విజేతలకు డీజీఎం రామచంద్రరావు ఫోన్ ద్వారా సమాచారం తెలియజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అవినీతిపై తిరుగుబాటు



- పూడాలో అక్రమ వసూళ్లపై రియల్ వ్యాపారుల ధర్నా
- అవినీతి అనకొండలా మారారని వైఎస్ చైర్మన్‌పై ఆగ్రహం
- బెదిరించి వసూలు చేసిన రూ.7 కోట్లు కక్కాలని మండిపాటు
- ప్రభుత్వం మారడంతో కార్యాలయం వద్ద బాధితుల ఆందోళన
- తమ డబ్బు తిరిగి ఇవ్వాల్సిందేనని బాధిత వ్యాపారుల డిమాండ్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పూడా మాది.. మా ప్రభుత్వం అధికారంలో ఉంది.. మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం.. మమ్మల్ని అడిగే వారెవరు.. అని వైఎస్ చైర్మన్ చెలరేగిపోయాడు. ప్రభుత్వ అండతో పెద్దఎత్తున అక్రమార్జనకు పాల్పడ్డాడు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. పూడా బాధితులు తిరుగుబాటుతో వైఎస్ చైర్మన్ కంగుతిన్నాడు. ఇంతకాలం నోరుమెదపకుండా వారు అడిగినట్లు.. చెప్పినట్లు చేసిన రియల్ వ్యాపారులు తమ నుంచి వసూలు చేసిన మొత్తాలను కక్కాలంటూ నరసరావుపేటలోని పూడా కార్యాలయం వద్ద బుధవారం ఆందోళనకు దిగారు. తమ డబ్బు తిరిగి చెల్లించాలని వైస్ చైర్మన్ గజ్జల శ్రీనివాసరెడ్డిని నిలదీశారు. నరసరావుపేట కేంద్రంగా పల్నాడు అర్బన్ డవలప్‌మెంట్ అధార్టీ(పూడా)ని గతంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనికి వైస్ చైర్మన్‌గా గతంలో జడ్పీ సీఈవోగా పనిచేసిన గజ్జల శ్రీనివాసరెడ్డిని నియమించింది. అయితే ఆయన నిబంధనలు, ప్లాన్ల మాటున అక్రమ వసూళ్లకు తెరలేపారని బాధితులు ఆరోపించారు. జిల్లాలో అనధికార లేవుట్లను 258 వరకు గుర్తించి నోటీసులు జారీ చేశారు. వెంచర్ల క్రమబద్ధీకరణకు సంబంధం లేకుండా ఒక్కొక్క వెంచర్ నుంచి రూ.2 లక్షలు డిమాండ్ చేయగా రూ.1.50 లక్షలకు అంగీకరించగా ఆ మేరకు డబ్బు చెల్లించామన్నారు. ఈ ప్రకారం తమ నుంచి రూ.3.72 కోట్లు వసూలు చేశారన్నారు. అలాగే బహుళ అంతస్తులు, షాపింగ్ కాంప్లెక్స్‌ల ప్లాన్ల మంజూరులో కూడా చేతివాటం ప్రదర్శించినట్లు బాధితులు తెలిపారు. డీవియేషన్ ఉన్న భవనాలు, బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లను గుర్తించి రూ.4 లక్షల నుంచి రూ.4.5 లక్షల చొప్పున వసూలు చేసినట్లు బాధితులు తెలిపారు. ఇలా రూ.3 కోట్లకు పైగా వసూలు చేశారని బాధితులు చెబుతున్నారు.



పూడా వైస్‌చైర్మన్ గజ్జల శ్రీనివాసరెడ్డితో మాట్లాడుతున్న సీఐ

వైసీపీనే వస్తుందని బరితెగింపు..

మళ్లీ వైసీపీ ప్రభుత్వం వస్తుందన్న ధీమాతోనే ఆయన బరి తెగించినట్లు ప్రచా రం జరుగుతోంది. ఈ క్రమంలో రియల్ వ్యాపారులతో పాటు పలువురు కాంట్రాక్టర్లు కూడా పూడా కార్యాలయానికి వచ్చి తమను తీవ్రంగా నష్టపరిచారంటూ ఆ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు పూర్తి చేసినా జీరో ఖాతా కింద చూపించారని వాపోయారు. ఆయన కారణంగా తాము అప్పులు పాలై ఆస్తులను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల ఆందోళనతో కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రూ.50 లక్షలు చెల్లింపు

వసూలు చేసిన అవినీతి సొమ్ములో రూ.50 లక్షలు కక్కించారు. కార్యాలయం వద్ద ఆందోళనతో కంగుతిన్న అవినీతి తిమింగలం దిగిరాక తప్పలేదు. అక్రమంగా వసూలు చేసిన సొమ్ములో శ్రీనివాసరెడ్డి కొంత తిరిగి ఇచ్చారని బాధితులు తెలిపారు. 3 గంటల వ్యవధిలోనే రూ.50 లక్షలు చెల్లించడం గమనార్హం. తమ ఆందోళనతో చేసిన తప్పును ఆయన అంగీకరించినట్లు బాధితులు తెలిపారు. ఒక్క రొంపిచర్ల మండలంలోనే ఈ అధికారి చేసిన ఆర్థిక అరాచకం వల్ల రూ.15 కోట్ల బిల్లులు రాలేదని బాధితులు చెప్పారు. ఓ కాంట్రాక్టర్‌కు రూ.3 కోట్ల బిల్లులు ఇవ్వకుండా పనులు జరగలేదని తప్పుడు సర్టిఫికేట్ ఇచ్చారన్నారు. దాచిన ఎం బూక్‌లను కాంట్రాక్టర్ల వారీగా తిరిగి ఆ శాఖ అధికారులకు అప్పగించేందుకు పోలీసుల సమక్షంలో ఒప్పందం జరిగిందన్నారు. రెండు రోజుల్లో ఎం బుక్‌లు తిరిగి ఇవ్వకపోతే మళ్లీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని తెలిపారు.

పెమ్మసాని.. ప్రభంజనం

- ప్రతీ రౌండ్‌లోనూ 10 వేలకుపైగా మెజార్టీ
- 22 రౌండ్లలోనూ పైచేయి సాధించిన కూటమి అభ్యర్థి
- 1971 నుంచి ఇప్పటి వరకు చంద్రశేఖర్‌దే అత్యధిక మెజార్టీ



రౌండ్లు	మెజార్టీ
1	25,132
2	18468
3	19782
4	24016
5	17833
6	15473
7	18458
8	21971
9	13888
10	20914
11	13755
12	18419
13	19939
14	12066
15	15143
16	17378
17	13786
18	10087
19	7955
20	6855
21	5218
22	821

గుంటూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు కూటమి అభ్యర్థిగా డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రభంజనం సృష్టించారు. నామినేషన్ సమయంలో పెద్దమొత్తంలో ఆస్తులు చూపి దేశవ్యాప్తంగా ఆసక్తి రేపిన ఆయన ఎన్నికల ఫలితాల్లోనూ అదే తీరు చూపారు. తొలి రౌండ్‌లోనే పాతిక వేలకు పైచిలుకు మెజార్టీ పెమ్మసానికి లభించింది. అది మొదలు ప్రతీ రౌండ్‌కు ఆయన మెజార్టీ అంతకంత పెరుగుతూ పోయింది. 22 రౌండ్ల పాటు ఈవీఎంల లెక్కింపు కొనసాగింది. మరోవైపు ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని సెంట్రల్ బ్లాక్‌లో ఈటీపీబీఎస్, పోస్టల్ బ్యాలెట్ల ఓట్లు నాలుగు రౌండ్ల పాటు కొనసాగాయి. వాటిల్లోనూ పెమ్మసాని కుమ్మేశారు. ఏ దశలోనూ వైసీపీ అభ్యర్థి కిలారి రోశయ్యకు పోల్ అయిన ఓట్లు పెమ్మసానికి సమీపానికి కూడా రాలేదు. మొదటి రౌండు నుంచి 18 రౌండ్ల వరకు ఆయన పదివేలకు పైగానే మెజార్టీ వచ్చింది. ఆ తర్వాత నుంచి తగ్గుతూ చివరి రౌండ్‌లో కేవలం 821తో సరిపెట్టుకున్నారు. ఇక ఈటీపీబీఎస్‌లో 86, పోస్టల్ బ్యాలెట్ తొలి రౌండ్‌లో 2153, రెండో రౌండ్‌లో 2597, మూడో రౌండ్‌లో 2402 ఓట్ల మెజార్టీని దక్కించుకున్నారు. తద్వారా 3 లక్షల 44 వేల 695 ఓట్ల మెజార్టీని సాధించారు. ఇంత మెజార్టీని గతంలో కాంగ్రెస్, టీడీపీ సాధించలేకపోయాయి. గుంటూరు లోక్‌సభ స్థానం చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో పెమ్మసాని చంద్రశేఖర్‌కు లభించింది. 1971 నుంచి ఏ ఎన్నికలు చూసినా ఇదే అత్యధిక మెజార్టీ కావడంతో చరిత్రపుటల్లో కొన్ని దశాబ్ధాల పాటు పెమ్మసాని పేరు నిలిచిపోతుంది. ఈ నియోజకవర్గం నుంచి గతంలో ఎంపీలుగా గెలిచిన ఆచార్య ఎన్‌జీ రంగా, రాయపాటి సాంబశివరావు, లాల్ జాన్‌బాషా, వైవీ రావు వంటి వారికే సాధ్యం కాని మెజార్టీని పెమ్మసాని సాధించారు. ఓటింగ్ శాతం పరంగా చూసుకుంటే 1971లో అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి కొత్త రఘురామయ్యకి మొత్తం ఓట్లలో 62.45 శాతం ఓట్లు పోలయ్యాయి. ఆ తర్వాత ఇప్పుడు పెమ్మసానికి 60.68 శాతం ఓట్లు వచ్చాయి. వైసీపీ అభ్యర్థి కిలారి రోశయ్యకు లభించిన 36.49 శాతం కంటే 24.19 శాతం ఓట్లు పెమ్మసానికి అధికంగా రావడం విశేషం.

వైసీపీ మూకల దాడి

- టీడీపీ శ్రేణులను అడ్డగించిన వైసీపీ నేతలు
- కూటమి విజయోత్సవాల్లో ఘర్షణ
- గొడ్డలితో దాడి చేసిన వైసీపీ మూక
- టీడీపీకి చెందిన వారికి తీవ్ర గాయాలు


4లో..

పడినా... నిలిచి గెలిచారు

- నరేంద్ర, శ్రావణ్, నసీర్, లోకేశ్, మనోహర్ భారీ విజయం
- వైసీపీ కుట్రలను ధీటుగా ఎదుర్కొని ప్రజల పక్షాన నిలబడటమే కారణమా !

వైసీపీ తాబేదారుల్లో.. వణుకు

- నాడు అంటకాగారు.. నేడు ఆందోళన
- విచక్షణ మరచిన అధికారులకు కాళరాత్రులే



గుంటూరు సిటీ, జూన్ 5: ఎంత ఉద్యోగులైనా ప్ర భుత్వంతో అంటకాగ డమనేది ఆక్షేపణీయం. వైసీపీ ప్రభుత్వంలో కొందరు ఉద్యోగులు అంతకంటే ఎక్కువగా రెచ్చిపోయారు. విచక్షణ మరచి కొందరు అధికారులు వైసీపీ నాయకులకంటే ఎక్కువగా ప్రవర్తించారు. ఇందులో అన్ని శాఖల అధికారులు ఉన్నా పోలీసులు చాలా ముందున్నారు. కొందరు డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పరుగులు పెట్టి మరీ వైసీపీకి ఊడిగం చేశారు. ఎన్నికల ఫలితాలు వైసీపీ తాబేదారుల జవసత్వాలను కుంగదీశాయి. వైసీపీ ముద్ర పడిన అధికారుల గుండెల్లో బండరాయి పడింది. ఎవరినో నమ్ముకుని ఏదో చేస్తే ఏదో అయ్యింది అన్న సామెత ఉమ్మడి గుంటూరు జిల్లాలో రుజువు అవుతోంది. యువనేత లోకేశ్ రెడ్ బుక్ ఫీవర్ కొందరు అధికారులకు నిద్ర పట్టకుండా చేస్తోంది.

అమ్మో.. ఎంత ఘోరం

అమరావతి ఉద్యమ సమయంలో ఓ డీఎస్పీ నిరసన శిబిరం వద్దకు వెళ్లి మహిళలను జుగుప్సాకరంగా మాట్లాడారు. రైతులపై లాఠీని ఝుళిపించారు. ఇప్పుడు ఆ అధికారి ఆత్మరక్షణలో పడ్డారు.

- పల్నాడులో ఎన్నికల కౌంటింగ్ ముగిసిన తర్వాత వైసీపీ నేతలు దాడులతో టీడీపీ కార్యకర్తలు పోలీసులను ఆశ్రయించగా సత్తెనపల్లి సబ్ డివిజన్ అధికారి వారిపై భూతులతో రెచ్చిపోయారు. ఊర్లు వదిలి వెళ్లాలని హుకుం జారీ చేశారు.
- మాచర్ల, గురజాల, సత్తెనపల్లి నియోజక వర్గాల పరిధిలోని పలువురు పోలీసు అధికా రులు టీడీపీ నేతలు, కార్యకర్తల పై తప్పుడు కేసులు నమోదు చేసి రోజుల తరబడి స్టేషన్లో నిర్బంధించారు.
- స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో విజయవాడ నుంచి మాచర్ల వచ్చిన టీడీపీ నేతలను హత మార్చేందుకు వైసీపీ రౌడీలు ప్రయత్నించారు. దీనిపై అప్పటి సీఐని ప్రశ్నిస్తే అసలు ఇక్కడకు ఎవరు రమ్మన్నా రంటూ టీడీపీ నేతలపై ఎదురు కేసుకు సిద్ధమయ్యారు.
- సీఐడీ విచారణ పేరుతో అమరావతిలోని టీడీపీ కార్యకర్త ఇంట్లోకి అర్ధరాత్రి ప్రవేశించి న పోలీసులు అమానవీయంగా ప్రవర్తించారు.
- మంగళగిరిలో లోకేశ్ గెలుస్తాడని జడ్పీ దగ్గర మీడియాతో చెప్పిన పెదకాకాని మండ లానికి చెందిన వెంకాయమ్మ అనే దళిత మహిళపై వైసీపీ మూకలు దాడి చేసి ఆమె కుమారుడ్ని కొట్టాయి.
- పిడుగురాళ్లకు చెందిన టీడీపీ కార్యకర్త రామకృష్ణ సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టా డని పోలీసులు తీసుకువెళ్లి ఇబ్బందులు పెట్టారు.
- పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే శంకర రావుపై ఎన్‌జీటీలో ఫిర్యాదు చేశాడని అమరా వతికి చెందిన టీడీపీ కార్యకర్తను పోలీసులు చిత్రహింసలకు గురిచేశారు.
- రఘురామకృష్ణంరాజును అరెస్టు చేసి గుంటూరుకి తీసుకువచ్చినప్పుడు కొందరు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. మెడికల్ రిపోర్ట్ విషయంలో వైద్యులను పోలీసులు బెదిరించారన్న ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వం వచ్చిన మొదట్లో ఉమ్మడి జిల్లా అధికారిగా పనిచేసిన వ్యక్తి పూర్తిగా వైసీపీ చొక్కా వేసుకుని పనులు చేశారు. వైసీపీ నేతలు ఎవరిని ఇబ్బంది పెట్టమంటే వాళ్లని ఇబ్బందులు పెట్టారు. ఉద్యోగులను సస్పెన్షన్ చేసే సందర్భంలోని బంధనలు పాటించలేదు.

- ఉమ్మడి జిల్లాలోని ఇద్దరు ముఖ్య అధికారులు టీడీపీ నేతలే లక్ష్యంగా తప్పుడు రిపోర్టులు ప్రభుత్వానికి పంపి వారిపై సీబీఐ కేసులకి కారణమయ్యారు.
- ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని టీడీపీ ఫిర్యాదు చేసినా కొందరు జిల్లా స్థాయిలో బుట్టదాఖలు చేశారు. ఈ అధికారులు చివరకు కొందరు మీడియా ప్రతినిధులను ఛాంబర్‌లోనికి కూడా రానివ్వలేదు.
- గ్రామ వార్డు, సచివాలయ ఉద్యోగుల ఎంపిక సమయంలో స్థానిక వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు చెప్పిన జాబితాను దగ్గర పెట్టు కుని టీడీపీ సానుభూతి పరులకు ఉద్యోగాలు రాకుండా చేశారు. చివరి కాంట్రాక్టు, ఔట్ సో ర్సింగ్ ఉద్యోగాల్లో కూడా అర్హులకు అన్యాయం చేశారు.
- ఓ చిరుద్యోగి టీడీపీకి అనుకూలంగా ఉన్నా రని తండ్రి శవం వద్ద ఉన్న సమ యంలో గుంటూరు వైద్యఆరోగ్య శాఖ కార్యాల యం నుంచి ఫోన్ చేసి త్వరగా వచ్చి సస్పె న్షన్ ఆర్డర్ తీసుకు వెళ్లాలని ఒత్తిడి చేసి పిలి పించి ఉత్తర్వులు చేతిలో పెట్టారు.

మెప్మాలో ఓ ఉన్నత స్థాయి అధికారిణి ద్వారా సంఘాలు లక్ష్యంగా రాజకీయం చేశారు. జిల్లా స్థాయిలో అధికారులను ఏర్పా టు చేసుకుని వైసీపీకి అనుకూలంగా ఉన్న వారిని అందలాలు ఎక్కించారు.

అరెస్టా.. పరారా?

పీఆర్కేకు ముగిసిన బెయిల్ గడువు ● సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో పిన్నెల్లికి గడ్డుకాలమే



నరసరావుపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అధికారం అండ.. పోలీసుల సహకారంతో చెలరేగిపోయిన మాచర్ల వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గడ్డుపరిస్థితులను ఎదుర్కొం టున్నాడు. అధికారం అండతో రెచ్చిపోయిన పిన్నెల్లి ఎన్నికల హింస నేపథ్యంలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. హత్యాయత్నం, పా ల్వాయిగేటు పోలింగ్ బూత్‌లో ఈవీఎం ధ్వం సం తదితర కేసులు ఆయనను వెంటాడుతున్నాయి. ఈ కేసుల్లో హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్ గురువారంతో ముగియనున్నది. ఈ నేపథ్యంలో గురువారం ఆయన కోర్టుకు హాజరు కావాల్సి ఉంది. హైకోర్టు ఆదేశాలతో నరసరావుపేటలో ఉన్న ఆయన ఎస్పీ కార్యాలయంలో రోజూ సంతకం చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం హైకోర్టు ఇచ్చే తీర్పుపై ఆయన అరెస్టు ఆధారపడి ఉంది. ఆయనను పోలీసులు ఈ సారైనా అరెస్టు చేస్తారా.. మళ్లీ తప్పించుకుని పోయేలా సహకరిస్తారా అంశం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. బెయిల్ గడువు పూర్తయిన వెంటనే పోలీసులు ఆయన్ను అరెస్టు చేసే విషయంలో ఏ విధంగా స్పందిస్తా రో చూడాలి. పాల్వాయిగేట్ టీడీపీ ఏజెంట్ నం బూరు శంకరరావు పిటీషన్ నేపథ్యంలో పిన్నెల్లి ముందస్తు బెయిల్‌పై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు నేపథ్యంలో తిరిగి ఆయనకు కోర్టులో ఊరట లభించకపోవచ్చని న్యాయ వాదులు చెబుతున్నారు. ఈ క్రమంలో పిన్నెల్లి కదలికలపై పోలీసులు నిఘా ఉంచారు.

వెంకట్రామిరెడ్డిని మరిచిన పోలీసులు

ఎన్నికల హింస కేసుల్లో ప్రధాన నిందితుడు, షాడో ఎమ్మెల్యేగా అరాచకాలు జరిపించిన పిన్నె ల్లి సోదరుడు వెంకట్రామిరెడ్డి కూడా తప్పిం చుకు తిరుగుతున్నాడు. స్టేషన్‌లో నమోదైన హత్యాయత్నం కేసులో ఆయన అరెస్టుకు పోలీసులు కనీస ప్రయత్నాలు కూడా చేయడం లేద ని బాధితులు ఆరోపిస్తున్నారు.

నియంతలకు గుణపాఠం

మాచర్ల నియోజకవర్గంలో పిన్నెల్లి బ్రదర్స్ నియంతల్లా వ్యవహరించారు. ఎదురు ప్రశ్నిం చిన వారిని భూమి మీద లేకుండా చేయించా రు. ఓటు ద్వారా ప్రజలు వారికి గుణపాఠం చెప్పారు. అధికారం అండతో అరాచకాలు చేస్తే శాశ్వతంగా తప్పించుకోలేరనడానికి పిన్నెల్లి ఉదంతమే ఉదాహరణ అని పలువురు చర్చించుకుంటున్నారు. వారు చేసిన విధంగానే ఎదుట పార్టీ వారు చేస్తే మీ పరిస్థితి ఏమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. బ్రదర్స్ అరెస్టు నుంచి తప్పించుకోలేరన్న వాదన వినిపిస్తోంది.


ఇది చారిత్రాత్మక విజయం

● సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జూన్ 5 : ఐదేళ్ళ నిరీక్షణ తర్వాత ప్రజలు తెలుగుదేశం పార్టీకి చారిత్రాత్మక విజయాన్ని అందించారని సత్తెనపల్లి నుంచి విజయం సాధించిన టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం కన్నా టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చంద్రబాబుతో పాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్ పవర్ ఇంజన్‌లా పనిచేయడం, వారికి బీజేపీ కలసిరావటంతో ఇంతటి ఘన విజయం సాధ్యమైందన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధిదిశలో పరుగు పెట్టిస్తారన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలుచేసి మాట నిలబెట్టుకుంటామన్నారు. పల్నాడు జిల్లాలో కూటమి అభ్యర్థులు అందరూ విజయం సాధించటమే కాకుండా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 17 స్థానాల్లో విజయం సాధించటం అభినందనీయమన్నారు. చక్రవడ్డీతో సహా వైసీపీకి ప్రజలు తిరిగి ఇచ్చేశారన్నారు. చంద్రబాబునాయుడును నిండు సభలో వైసీపీ ఎమ్మెల్యేలు అవమానించినప్పుడు ముఖ్యమంత్రి అయిన తర్వాతనే సభలో అడుడు పెడతానని శభదం చేశాడు. అన్నట్లుగానే ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారన్నారు. వైసీపీ ఘోర పరాజయానికి వైఎస్ జగన్ వైఖరి, వ్యక్తిత్వమే కారణమని కన్నా అన్నారు.

విజయాన్నందించిన ప్రజలకు ధన్యవాదాలు

● నాదెండ్ల మనోహర్


నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, జూన్ 5: రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయనివిధంగా సంక్షేమ పాలన అందించాం.. అంటూ చెప్పుకునే జగన్ మాటలను ప్రజలు నమ్మలేదు. మనం ఏం చెప్పినా నమ్ముతారనుకోవడానికి ప్రజలు తెలివిలేని వారుకాదు. ఐదేళ్ల వైసీపీ జగన్ పాలనలో ప్రజలు ఎంతగా విసిగిపోతే 175 స్థానాలకు 11 మాత్రమే ఇస్తారని ఇది జగన్ పాలనకు చెంపపెట్టు అని జనసేన పీఏసీ చైర్మన్, తెనాలి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ జగన్ పాలన ప్రారంభించిన తరువాత ప్రజావేదిక కూల్చివేయడం, అన్న క్యాంటిన్లను మూయించడం, రాజధాని తరలింపు నిర్ణయం, నిరసన తెలుపుతున్న రైతులను, కూలీలను పోలీసులతో కొట్టించడం, అక్రమ కేసులు పెట్టించడం వంటి పలు రకాల పరిణామాలతో రాష్ట్ర ప్రజలు తీవ్ర మనోవేదనకు గురయ్యారన్నారు. జగన్ వల్ల రాష్ట్రానికి నష్టం కలుగుతుందని పవన్ కల్యాణ్ ఓట్లు చీలకుండ వైసీపీ విముక్త పేరుతో పోరాటాలు చేశారని గుర్తుచేశారు. కూటమిని ఆశీర్వదించిన రాష్ట్ర ప్రజలకు ధన్యవాదాల తెలిపారు. తెనాలి ఎమ్మెల్యేగా తన గెలుపు కోసం కృషి చేసిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రజలు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీని పాతాళంలో తొక్కి రాష్ట్రానికి మంచి చేసే కూటమి నాయకత్వాన్ని అత్యంత మెజారిటీతో ఎన్నుకుని రాజకీయాల్లో చరిత్ర సృష్టించారన్నారు. ప్రజాసేవకులుగా తామంతా ఒళ్లు దగ్గరపెట్టుకొని ప్రజలకు సేవచేస్తామన్నారు. ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి తెనాలికి పూర్వ వైభవనం తెస్తామని స్పష్టం చేశారు. పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు రైతు మృతి


అప్పారావు (ఫైల్)

కారుమంచి(శావల్యాపురం)జూన్ 5: పిడుగుపాటుకు గురై రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని కారుమంచిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన గోగినేని అప్పారావు(40) గేదెలను మేపుకొనేందుకు మంగళవారం సాయంత్రం వెల్లలచెరువు డొంక వైపున్న పొలాలకు తోలుకెళ్ళాడు. అనుకోకుండా ఉరుములతో కూడిన వర్షం మొదలైంది. వర్షంలో తడుస్తున్న అప్పారావుకు దగ్గరలో పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పారావు ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్థులు అప్పారావును వెతుక్కొంటూ పొలం వద్దకు వెళ్లారు. పొలంలో అప్పారావు నేలపై పడిపోయి ఉండడాన్ని గమనించి దగ్గరికెళ్ళి చూడగా అతడు మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని ట్రాక్టర్‌లో ఇంటికి తీసుకొచ్చారు. మృతుడు అప్పారావుకు భార్య, కుమార్తె ఉన్నారు.

వైసీపీ మూకల దాడి

● టీడీపీ శ్రేణులను అడ్డగించిన వైసీపీ నేతలు
● కూటమి విజయోత్సవాల్లో ఘర్షణ
● గొడ్డలితో దాడి చేసిన వైసీపీ మూక
● టీడీపీకి చెందిన వారికి తీవ్ర గాయాలు


దాడిలో గాయపడిన లాల్‌సింగ్ నాయక్, అంజి నాయక్


రాములు నాయక్

నకరికల్లు, జూన్5: ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించటంతో టీడీపీ శ్రేణులు కుంకలగుంట శివారు పాపిశెట్టిపాలెంలో విజయోత్సవ సంబరాలు నిర్వహిస్తున్న సమయంలో మా వీధుల వైపు రావద్దంటూ వైసీపీ శ్రేణులు అడ్డుకున్నారు. దీంతో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య మాటామాటా పెరగటంతో దాడులకు పాల్పడ్డారు. టీడీపీకి చెందిన మలావత్ లాల్‌సింగ్ నాయక్‌పై వైసీపీ మూకలు గొడ్డలితో దాడిచేసి గాయపరిచారు. అతనితో పాటు బాణావత్ అంజినాయక్, మలావత్ ఏసునాయక్, బాణావత్ వెంక టేశ్వర్లు నాయక్, బాణావత్ రాములు నాయక్, శ్రీను నాయక్‌లకు గాయాలయ్యాయి. ఈఆరుగురు నరసరావుపేటలోని ఒక వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. దాడితో పాటు టీడీపీకి చెందిన నలువురికి చెందిన నాలుగు బైక్‌లను వైసీపీ మూకలు ధ్వంసం చేశారు. మొత్తం ఈ దాడుల్లో 30 మందికి పైగా పాల్గొన్నట్లు బాధితులు చెపుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

త్రిపురాపురంలోను ఇరు వర్గాల మధ్య ఘర్షణ

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎన్నికల్లో విజయం సాధించటంతో త్రిపురాపురం గ్రామంలో కూటమి శ్రేణులు బాణాసంచా పేలుస్తూ విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ క్రమంలో గ్రామంలో మరో వర్గానికి చెందిన మద్ద మోహన్‌రావు, రమాదేవి, నాగేశ్వరరావులు అడ్డుకొని మా వీధుల్లోకి రావద్దని అడ్డ కోవటంతో తొగురు తిరుపతిరావు, రామకృష్ణలకు, అడ్డుకున్న ముగ్గురికి ఘర్షణ తలెత్తింది. ఇరువర్గాలు దాడులకు పాల్పడ టంతో ఐదుగురికి గాయాలయ్యాయి. గాయ పడిన వీరు నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను తగుల బెట్టిన వైసీపీ దుండగులు

ఎన్నికల్లో కూటమి విజయం సాధించటంతో గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులు మండలంలోని కుంకలగుంటలో విజయోత్సవ సంబరాలు జరుపుకుంటున్నారు. ఈక్రమంలో అగడ్డి సమీపంలో కొందరు వైసీపీకి చెందిన దుండగులు తెలుగు యువత ప్రతినిధి కిష్టంశెట్టి చిన్నాకు చెందిన అటుగా వెళ్తున్న కొత్త బైక్‌కు పెట్రోల్ పోసి నిప్పటించారు. మంటల్లో బైక్ పూర్తిగా దగ్ధమైంది. ముకుంద స్వరూప్ అనే యువకుడి పైన వైసీపీ దుండగులు దాడిచేసి కొట్టారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో పోలీసు పికెట్ ఉన్నప్పటికీ ఈ ఘటనలు జరగటం గమనార్హం.


కుంకలగుంటలో ద్విచక్రవాహనాన్ని దహనంచేసిన వైసీపీ దుండగులు

పడినా... నిలిచి గెలిచారు

● నరేంద్ర, శ్రావణ్, నసీర్, లోకేశ్‌ల, మనోహర్‌ల భారీ విజయం
● వైసీపీ కుట్రలను ధీటుగా ఎదుర్కొని ప్రజల పక్షాన నిలబడటమే కారణమా !

గుంటూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో వైసీపీ గాలిలో ఓటమి చవి చూసిన గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఐదుగురు తెలుగుదేశం, జనసేన అభ్యర్థులు ఈ దఫా సత్తా చాటారు. అలా... ఇలా కాదు. భారీ మెజార్టీలతో ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులను మట్టికరిపించారు. మాజీ సీఎం జగన్ నివాసం ఉన్న మంగళగిరిలో 91వేల పైచిలుకు మెజార్టీ సాధించడం గాలివాటంగా రాలేదు. అలానే ముస్లిం మైనార్టీలు బలంగా ఉన్న గుంటూరు తూర్పు నియోజకవర్గంలోనూ 31వేల పైచిలుకు మెజార్టీ సాధించగలగడం ఆషామాషీ కాదు. పొన్నూరులో అయితే టీడీపీ నేతలు కార్యకర్తలు వీరోచితంగా పోరాడి ఈ విజయాన్ని దక్కించుకున్నారు.

గత ఐదేళ్ల వైసీపీ పరిపాలనలో పొన్నూరు నియోజకవర్గంలో ధూళిపాళ్ల నరేంద్ర తీవ్ర వేధింపులకు గురయ్యారు. అనేక అక్రమ కేసులను ఆయనపై వైసీపీ ప్రభుత్వం బనాయించి జైలులో పెట్టింది. చివరికి సంగం డెయిరీనీ ఆక్రమించుకొనే ప్రయత్నం చేసింది. ఒక స్పెషల్ ఆఫీసర్‌ని కూడా నియమించింది. ఇక కార్యకర్తలపై ప్రతీ గ్రామంలోనూ వేధింపులు జరిగాయి. వాటన్నింటిని ధీటుగా ఎదుర్కొంటూ నరేంద్ర నిలబడగలిగారు. తనపై పెట్టిన కేసుని న్యాయస్థానంలో ఎదుర్కొని గెలిచి జైలు నుంచి విడుదలయ్యారు. మరోవైపు వైసీపీ నేతలు చేబ్రోలు మండలంలో దోచేసిన సహజ వనరులపై అలుపెరగని పోరాటమే చేశారు. కార్యకర్తలకు కష్టం వస్తే వెళ్లి అండగా నిలిచారు. ఇవన్ని ఆయనకు సానుకూలంగా మారి ఎన్నికల్లో 32,915 ఓట్ల భారీ మెజార్టీని సాధించి పెట్టాయి. గుంటూరు తూర్పు నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన షేక్ నసీర్ అహ్మద్ గడిచిన ఐదేళ్లలో వీరోచితంగా పోరాడారు. మాజీ ఎమ్మెల్యే ముస్తఫా, ఆయన కుటుంబ సభ్యులు చేసిన దోపిడీలు, కబ్జాలను ధైర్యంగా బహిర్గతం చేశారు. కేసులకు బెదరకుండా పోరాటాలు, ఆందోళనలు నిర్వహించారు. టీడీపీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా వెళ్లి అండగా నిలిచేశారు. ఎప్పుడైతే నగరపాలకసంస్థలో కొత్తపేటలోని ఒక డివిజన్‌కు జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని నసీర్ గెలిపించుకొన్నారో అప్పుడే ఆయన విజయానికి తొలి మెట్టు పడింది. అది మొదలుకొని ఆయనకు ప్రజల ఆదరణ పెరిగిపోవడంతో ఎన్నికల్లో 31,962 ఓట్ల మెజార్టీని దక్కించుకొన్నారు.

మంగళగిరి నుంచి పోటీ చేసిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గత ఎన్నికల్లో సుమారు ఐదే వేల ఓట్ల మెజార్టీతో ఓటమి పాలయ్యారు. దాంతో వైసీపీ నేతలు ఆయన్ని తీవ్రంగా అవమానించారు. ప్రత్యక్ష రాజకీయాల్లో ఆయన గెలవలేరని తూలనాడారు. లోకేష్ కుటుంబంపై బురదజల్లారు. ఆయనపై రాజధాని భూములకు సంబంధించి అక్రమ కేసులు కూడా సీఐడీ బనాయించింది. వీటన్నింటిని తట్టుకొని ఆయన నిలబడ్డారు. మరోవైపు తన స్వంత నిధులు వెచ్చించి మంగళగిరి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎంతోమందికి ఉపాధి కల్పించారు. పరికరాలు పంపిణీ చేశారు. ఏ కార్యక్రమానికి ప్రజలు పిలిచినా వెళ్లి ఆశీర్వదించారు. జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగాలు ఇప్పించారు. ఇవన్ని ఆయనకు ప్లస్ పాయింట్‌లుగా మారాయి. ఎన్నికల నాటికే ఆయన గెలుపు ఖరారు కాగా మెజార్టీ 60 వేలా... 80 వేలా అని లెక్కించారు. అయితే ఆ అంచనాలనడు కూడా దాటి 91,413 ఓట్ల మెజార్టీని లోకేశ్ పొందడం గుంటూరు జిల్లా చరిత్రలోనే రికార్డుగా మారింది.

సాదాసీదాగా అందరితో కలిసిమెలిసి ఉండే తెనాలి శ్రావణ్ కుమార్ గత 15 ఏళ్లుగా తాడికొండని అంటిపెట్టుకొని ఉన్నారు. 2009లో ఓటమి పాలైనా ప్రజలకు అండగానిలిచి వారి సమస్యలపై పోరాటం చేసి 2014లో గెలుపొందారు. ఆ తర్వాత అమరావతి రాజధానిని తాడికొండ నియోజకవర్గంపరిధిలోనే సీఎం చంద్రబాబు ఏర్పాటు చేశారు. శ్రావణ్‌కుమార్ ఎమ్మెల్యే అయినప్పటికీ గన్‌మెన్‌లను నియమించుకోరు. ఎక్కడికెళ్లినా ఒంటరిగానే వెళతారు. నియోజకవర్గానికి ఎంతో మేలు చేసినా 2019 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ మనోధైర్యం కోల్పోకుండా ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటంచేసి 39,606 ఓట్ల మెజార్టీని ఈ దఫా సాధించారు.

తెనాలిలో గత ఎన్నికలలో టీడీపీ, జనసేన వేర్వేరుగా పోటీ చేయడం వలన అక్కడ జనసేన అభ్యర్థి నాదెండ్ల మనోహర్ మూడోస్థానానికి పరిమితమయ్యారు. ఆయన జనసేనలో కీలక భూమిక పోషిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశారు. తెనాలిని గతంలో అభివృద్ధి చేసిన ప్రజాప్రతినిధిగా మంచి పేరు ఉండటం ఈఎన్నికల్లో ప్లస్ పాయింట్ అయింది. మరోవైపు వైసీపీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ అరాచకాలను అక్కడి ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. టీడీపీ క్యాడర్ అంతా కష్టపడటంతో మనోహర్ 48,112 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

టీడీపీ శ్రేణులపై వైసీపీ వర్గీయుల దాడి

● ఐదుగురు టీడీపీ కార్యకర్తలకు గాయాలు

యడ్లపాడు, జూన్ 4: సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ ప్రభంజనాన్ని వైసీపీ వర్గీయులు ఓర్వలేక రగిలిపోయారు. ఉక్రోషంతో దాడులకు తెగబడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మంగళవారం యడ్లపాడు ఎగువ ఎస్సీ కాలనీలో టీడీపీ వర్గీయులు సంబరాలు చేసుకున్నారు. సుమారు 11.30గంటల సమయంలో వీధుల్లోకి వచ్చి రంగులు చల్లుకుంటూ బాణాసంచా కాలుస్తూ ఆనందం వ్యక్తం చేశారు. అయితే లక్షల్లో బెట్టింగ్‌లు పెట్టి నష్టపోయిన వైసీపీ వర్గీయులు కర్రలు, రాళ్ళతో టీడీపీ వర్గీయులపై దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు కాలనీకి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో వైసీపీ వర్గీయులు విసిరిన రాళ్ళు పోలీసుల ప్రక్క నుంచి దూసుకెళ్ళాయి. దీనితో తృటిలో రాళ్ళదాడి నుంచి పోలీసులు తప్పించుకున్నారు. దాడులలో టీడీపీ వర్గీయులు కట్టా రాజేష్, కోడిరెక్క జయకర్, కోడిరెక్క సురేంద్ర, అంబడిపూడి గజేంద్ర, నేలటూరి రత్తయ్యలు గాయపడ్డారు. గాయపడిన వారిని చిలకలూరిపేట ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.


వైసీపీ మూక దాడిలో గాయపడిన రాజేష్, జయకర్, సురేంద్ర

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు
- పల్నాడు జిల్లా ఎస్పీ మలికాగార్గ్

శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే సహించబోమని పల్నాడు జిల్లా ఎస్పీ మలికాగార్గ్ హెచ్చరించారు. బుధవారం యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సందర్శించారు. ముందుగా మండలంల పరిస్థితులపై అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, డీఎస్పీ భూపాల్, రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ శ్యామ్యూల్ రాజీవ్‌కుమార్‌లతో చర్చించారు. అనంతరం ఎస్పీ విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేందుకు కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతం చేశామన్నారు. ఘర్షణలు నెలకొన ప్రాంతాల్లోని స్టేషన్లను సందర్శిస్తున్నానని, దానిలో భాగంగానే మంగళవారం యడ్లపాడు ఎగువ ఎస్సీ కాలనీలో ఇరు వర్గాల మధ్య ఘర్షణలు జరిగిన నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై స్టేషనుకు వచ్చామన్నారు. ఈ ఘటనలో 11 మందిపై కేసు నమోదు చేసి, వారిలో పలువురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.


యడ్లపాడు స్టేషన్‌ను సందర్శించి వెళుతున్న ఎస్పీ మలికా గార్గ్

7న తెనాలి ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా

గుంటూరు(విద్య), జూన్5: ఈనెల 7న తెనాలిలోని ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రావి చిన్న వెంకటేశ్వర్లు మంగళవారం ఓ ప్రటనలో పేర్కొన్నారు. జాబ్‌మేళాలో 14 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఐటీఐ ఫిట్టర్, టర్నర్, మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, ఎంఎంవీ, డీజిల్ మెకానిక్ అర్హత ఉన్నవారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 10 గంటలకు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్‌తో రావాలని సూచించారు. ఇతర వివరాలకు 9014491772 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

మాదిగలకు జగన్ తీవ్ర అన్యాయం

● మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్

గుంటూరు(కార్పొరేషన్), జూన్ 5: రాష్ట్రంలో మాదిగ సామాజిక వర్గానికి జగన్మోహన్‌రెడ్డి తీవ్ర అన్యాయంచేశారని మాజీ మంత్రి మాణిక్యావర ప్రసాద్ ఆరోపించారు. బుధవారం గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి పరిపాలనంత అస్తవ్యస్తంగా జరిగిందన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ టికెట్‌ల కేటాయింపుల్లో మాదిగ సామాజిక వర్గానికి వైసీపీ తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన చెందారు. ఇలా ప్రతి అంశంలో ఆయన మాదిగలకు అన్యాయం చేశారని వరప్రసాద్ ఆరోపించారు.


విలేకర్లతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సంక్షేమం, అభివృద్ధి రెండూ కావాలి

● ఎన్డీయే విజయంపై బీజేపీ నేతల హర్షం

తెనాలి అర్బన్, జూన్ 5: సంక్షేమంతో పాటు అభివృద్ధిని ప్రజలు కోరుకుంటున్నారనే విషయం ఈ ఎన్నికల్లో స్పష్టమైందని బీజేపీ మీడియా కమిటీ సభ్యులు పాటిబండ్ల రామకృష్ణ చెప్పారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ, అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో ఎన్డీయే విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తెనాలి ఎమ్మెల్యేగా నాదెండ్ల మనోహర్, గుంటూరు ఎంపీగా పెమ్మసాని చంద్రశేఖర్ భారీ మెజారిటీతో విజయం సాధించడం పట్ల అభినందించారు. ఇక రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా జరుగుతుందన్నారు. రాజధాని అమరావతి, పోలవరంలను పూర్తి చేయాలని కోరారు. పార్టీ నేతలు వాసుదేవనాయుడు, యోగానందకిషోర్, యశ్వంత్ పాల్గొన్నారు.


నారా లోకేశ్, నందమూరి బాలకృష్ణలతో భాష్యం ప్రవీణ్

అగ్రనేతలను కలిసిన భాష్యం ప్రవీణ్

క్రోసూరు, జూన్ 5: పెదకూరపాడు ఎమ్మెల్యేగా ఎన్నికైన బాష్యం ప్రవీణ్ బుధవారం టీడీపీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు గృహానికి వెళ్ళి ఆయన ఆశీస్సులు స్వీకరించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పార్టీకి మంచి మెజార్టీ లభించిందని చంద్రబాబుకు వివరించారు. నారా లోకేశ్‌ను కలుసుకొని ఎన్నికల ధ్రువీకరణ పత్రాన్ని ఆయనకు చూపించారు. అనంతరం నందమూరి బాలకృష్ణ ఆశీస్సులు స్వీకరించారు. నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషిచేయాలని వారు భాష్యం ప్రవీణ్‌కు సూచించారు.

లోకేశ్‌ను కలిసిన కొమ్మాలపాటి


టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేష్‌తో కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేటటౌన్, జూన్ 5 : టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని ఆయన నివాసంలో బుధవారం మర్యా ద పూర్వకంగా టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టుదల, మొక్కవోని దీక్షతో మంగళగిరి నియోజకవర్గంలో రికార్డుమెజార్టీతో విజయం సాధించి చరిత్రసృష్టించారన్నారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి వెన్నా సాంబశివారెడ్డి ఉన్నారు.

ఐదేళ్ల కష్టాల నుంచి ప్రజలకు విముక్తి

● నక్కా ఆనందబాబు


నక్కా ఆనందబాబు

కొల్లూరు, జూన్ 5: ఎన్నికల ఫలితాలు సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ అంశమని, ఐదు సంవత్సరాలు రాష్ట్ర ప్రజలు పడిన కష్టాల నుంచి విముక్తి కలిగిన రోజని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. బుధవారం కొల్లూరు మండలం జువ్వలపాలెంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త వేములపల్లి రవికిరణ్ భారీ మెజారిటీతో ఘన విజయం సాధించిన ఆనందబాబుకు ఘనస్వాగతం పలికి పూలమాలలతో సత్కరించారు. అనంతరం విజయోత్సవ కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేసి నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలు ఎన్నికల కోసం ఎదురు చూసి బ్యాలెట్ ద్వారా జగన్మోహనరెడ్డి లాంటి వ్యక్తులకు ఓటు అనే ఆయుధంతో తమదైన శైలిలో తీర్పు ఇచ్చారన్నారు. 175 సీట్లకు 164 సీట్లలో టీడీపీ కూటమికి అఖండ విజయం చేకూర్చారన్నారు. గత ఎన్నికల్లో జగన్మోహనరెడ్డికి 151 సీట్లుతో అధికారం ఇస్తే టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారన్నారు. పోలీసులు సైతం వైసీపీ పాలనలో అడ్డగోలుగా వ్యవహరించడం చూశామన్నారు. ఐదేళ్లలో తమ అధినేత చంద్రబాబు వ్యక్తిగత దూషణలతో చాలా ఇబ్బందులకు గురి చేయడంతో పాటు అక్రమ కేసులు బనాయించి జైలులో 53 రోజులు నిర్బంధించడం చూసిన రాష్ట్ర ప్రజలతో పాటు ఇతర రాష్ట్రాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా తెలుగు జాతి చేసిన ఉద్యమం మరిచిపోలేనిదన్నారు. వైసీపీ ఇక రాజకీయ పార్టీగా ఉండదని తాళాలు వేసుకునే పరిస్థితి వారికి దాపురించిందన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పుతో మా మీద బాధ్యతల భారం ఎక్కువైందని వారు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము కాకుండా పరిపాలన సాగిస్తామన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, తాము ప్రతిజ్ఞ చేసి ప్రజలకు అంకితభావంతో పని చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పునకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, జీఎల్‌జి భగవాన్, తూనుగుంట్ల సాయిబాబా, బట్టు మల్లిఖార్జునరావు, తాతారావు, వేములపల్లి జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని గెలిపించారు

● ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్


ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్, జూన్5: ప్రజలు అఖండ మెజార్టీతో గెలిపించి ఇచ్చిన అభిమానాన్ని అభివృద్ధిగా మార్చి తిరిగి వారికి ఇస్తానన్ని పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ బుధవారం అన్నారు. ప్రజాస్వామ్యాన్ని గెలిపించిన పొన్నూరు ప్రజలకు తన కృతజ్ఞతలు తెలియజేసారు. తన విజయానికి సహకరించిన టీడీపీ, జనసేన, బిజేపి నాయకులు, కార్యకర్తలకు ధన్యావాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో ఆశీర్వదించి ఆరో సారి శాసన సభ్యుడిగా గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఐదేళ్ల దుష్టపాలనను తరిమికొడుతూ నవశకానికి నాంది పలికేలా ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు. తన తండ్రి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి హాయం నుంచి తన వరకు 41 ఏళ్లుగా పొన్నూరు ప్రజలు తమ కుంటుంబానికి అండగా ఉంటూ ఆశీర్వదించారని తెలిపారు. ప్రస్తుతం కూడా అదే అభిమానాన్ని చాటుకుని ప్రజాస్వామ్యాన్ని గెలిపించారన్నారు. ప్రజలు ఇచ్చిన ఉత్సాహంతో వచ్చే ఐదేళ్లు పొన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రజా సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట ఇచ్చారు.


మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు , మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు

అఖండ విజయాన్ని అందించారు

● జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూన్ 5: రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు పడిన కష్టాన్ని గుర్తు పెట్టుకుని ప్రజలు కూటమికి 164 సీట్లుతో అఖండ విజయం అందించారని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావుతో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ రికార్డు స్థాయిలో మెజార్టీ అందించి ప్రజలు పట్టం కట్టారని ఇది ప్రజా విజయం అని తెలిపారు. పల్నాడు ప్రజలతో పాటు ఎన్డీఏ కూటమి నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. చరిత్రాత్మక గెలుపును నేను ఎప్పటికీ మరిచి పోనని, ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. జన్మభూమి రుణం తీర్చుకోవడానికి ఇక్కడ ఐదుసార్లు పోటీచేసి, మూడు సార్లు గెలుపొందానని చెప్పారు. ప్రజలు నాయకులు సహకారంలో వినుకొండను అభివృద్ధి చేసి చూపిస్తామని తెలిపారు. వినుకొండలో మంచినీటి సమస్య పరిష్కరిస్తామని, ఇంటింటికి కుళాయి నీరు అందిస్తామని, ఘాట్‌రోడ్డు నిర్మిస్తామని, కొండపై దేవాలయం నిర్మిస్తామని, వాటర్ గ్రిడ్ ద్వారా మండలంలోని ప్రతి గ్రామానికి మంచి నీరు అందిస్తామని అన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు మాట్లాడుతూ నూతనంగా గెలుపొందిన ఎంపీ, ఎమ్మెల్యేలు చక్కగా పనిచేస్తారని, తప్పనిసరిగా బొల్లాపల్లి రిజర్వాయర్ నిర్మాణంతో పాటు, వరికిపూడి సెల ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అవుతుందని, ఇద్దరు కలిసి పనిచేస్తారని రానున్న రోజుల్లో ప్రజలందరికి మంచి జరుగుతుందని తెలిపారు.

కార్యక్రమంలో మీసాల మురళీ కృష్ణ, ఆయూబ్ ఖాన్, నన్నేసా, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జీవీ ఆంజనేయులుని ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	152, 161,173
చికెన్ విత్ స్కిన్	294.00
చికెన్ స్కిన్ లెస్	304.00

గుంటూరు సిటీ వార్తలు

● గుంటూరు తూర్పు ● పశ్చిమ

జనసేన కార్యాలయంలో సంబరాలు

● పవన్ కల్యాణ్ విజయంపై హర్షం

గుంటూరు, జూన్ 5: పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించడంతో పాటు పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసేనాని పవన్ కల్యాణ్ భారీ మెజార్టీతో విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు. జై జనసేన, పవన్ కల్యాణ్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బోనబోయిన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు తెర దించి ఎన్‌డీఏ కూటమి ఘన విజయం సాధించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్లు యర్రంశెట్టి పద్మావతి, దాసరి నాగలక్ష్మి, పాకనాటి రమాదేవి, బిట్రగుంట మల్లిక, నారదాసు ప్రసాద్, అడపా మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్రంలో వైసీపీ దారుణ పరాజయంతో ప్రజల గుండెల్లో పెనుభారం దిగిపోయిందని, ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వ పాలన కోసం వారు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాయబ్ కమాల్ తెలిపారు. బుధవారం రాష్ట్ర రెల్లి యువనేత సోమి ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన విజయోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తొలుత జనసేనాని పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి, సోమి శంకరరావు, అడపా మాణిక్యాలరావు, ఆనంద్ సాగర్, ఆసియా, శివశ్రీ, సుజాత, విజయలక్ష్మి, సూదా నాగరాజు, బండ్రెడ్డి చందు, రవీంద్ర, రాజేష్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ తదితరులు

కూటమి విజయాన్ని స్వాగతిస్తున్నాం

● ఏపీ ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు

గుంటూరు(తూర్పు), జూన్ 5 : రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయం సాధించడంపై ఏపీ ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు ఆనందాన్ని వ్యక్తం చేశారు. బుధవారం ఏపీ ఎన్జీవో సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వానికి అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న చంద్రబాబునాయుడుకు ఉద్యోగుల పక్షాన అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు ప్రాధాన్యత అంశంగా తీసుకుని పరిష్కారం చేయాలని చంద్రబాబు నాయుడుకు ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సతీష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే శ్రీనివాసరావు, సభ్యులు శ్యామ్ సుందర్ శ్రీనివాస్, సూరి, కళ్యాణ్, అనిల్ కుమార్, సునీల్, వేణుగోపాల్, ఇస్సా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఘంటసాల, పాల్గొన్న సంఘ సభ్యులు

జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ

● హర్షం వ్యక్తం చేసిన ఎస్పీ

● సహకరించిన రాజకీయ పక్షాలు, ప్రజలకు కృతజ్ఞతలు



ఎస్పీ తుషార్ డూడీ

గుంటూరు, జూన్ 5 : జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరగడంలో కీలక భూమిక పోషించిన పోలీసులు, కేంద్ర బలగాలు, తమిళనాడు పోలీసులను జిల్లా ఎస్పీ తుషార్ డూడీ శెబాష్ పోలీస్ అంటూ అభినందించారు. నేటితో ఎన్నికల కోడ్ ముగిసి ఆయా బలగాలు వెనుతిరగ నుండడంతో ఎస్పీ వారందరినీ అభినందించారు. అదేవిధంగా ఎన్నికల విధుల్లో పాలు పంచుకున్న పోలీస్ అధికారులు, సిబ్బందిని కూడా ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో ఆయన హర్షం వ్యక్తం చేసారు. ముఖ్యంగా ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ జారీ అయిన దగ్గరి నుంచి జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో కౌంటింగ్ బందోబస్తు విధుల్లో పాల్గొన్న పోలీసు సిబ్బందికి, కేంద్ర, రాష్ట్ర బలగాలు, ఇతర శాఖల అధికారుల కృషి, సేవలకు అభినందనలు తెలిపారు. పోలీంగ్, కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా సహకరించిన అన్ని వర్గాల ప్రజలు , రాజకీయ పార్టీలు, మీడియాకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు.

రెగ్యులర్ సర్వీసు రెండేళ్లు పూర్తయితేనే

ఉద్యోగులకు ప్రొబేషన్ డిక్లరేషన్

గుంటూరు, జూన్ 5: ఉద్యోగులు తెలుసుకోదగిన ముఖ్య విషయాలు గురించి రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య బుధవారం ఒక ప్రకటనలో వివరించారు.

● రెగ్యులరైజేషన్, ప్రొబేషన్ డిక్లరేషన్ : ప్రభుత్వంతో సెలక్ట్ చేయబడిన ఉద్యోగుల సర్వీసు రెగ్యులరైజేషన్ వారి నియామకపు తేదీ నుంచి చేయబడుతుందన్నారు. పోలీసు యాంటిసిడెంట్స్ బి ఫోర్ టూ సకాలంలో రాని కారణంగా రెగ్యులరైజేషన్ పెద్ద ఆటంకంగా ఉందన్నారు. రెగ్యులరైజేషన్ తేదీ నుంచి మాత్రమే సీనియారిటీ పరిగణించబడుతుందన్నారు. రెగ్యులర్ సర్వీసు రెండు సంవత్సరాలు పూర్తయిన తరువాత ప్రొబేషన్ డిక్లరేషన్ చేయబడుతుందన్నారు.

● సెప్పింగ్ అప్ పే - సీనియర్ - జూనియర్ వేతన వ్యత్యాసం ఎఫ్ఆర్ - 27 కింద సవరించబడు తుందన్నారు. అయితే అట్టి వేతన వ్యత్యాసానికి వ్యక్తిగత ప్రత్యేకతలు కారణమై ఉండకూడదన్నారు. 10/15 సంవత్సరాల స్కేళ్ళను పొందిన తదుపరి ప్రమోషన్ పొందిన జూనియర్ కంటే సదరు స్కేళ్ళను పొందకుండానే ప్రమోషన్ పొందిన సీనియర్ తక్కువ వేతనం పొందుతుంటే జీవో -297 ప్రకారం అట్టి సీనియర్ వేతనాన్ని జూనియర్ వేతనంతో సమాన పరుస్తూ స్టెప్పింగ్ అప్ చేస్తారన్నారు. అలాగే 10/15/22 సంవత్సరాల స్కేళ్ళను పొంది కింది పోస్టులోనే కొనసాగుతున్న జూనియర్ కంటే సదరు స్కేళ్ళను పొందక మునుపే ప్రమోషన్ పొందిన సీనియర్ తక్కువ వేతనం పొందుతుంటే వారి వేతనాన్ని కూడా జీవో -75 అనుసరించి స్టెప్పింగ్ అప్ చేస్తారన్నారు.

2010 వేతన స్కేళ్ళలో స్టెప్ అప్ సౌకర్యం పునరుద్ధరించబడుతుందన్నారు. జీవో -52 ప్రకారం పై కారణాల రీత్యా 2008 జూలై ఒకటవ తేదీ నాటికి సీనియర్ కంటే జూనియర్ ఎక్కువ వేతనం పొందుతున్న యడల ముందు స్టెప్ అప్ చేసి తదుపరి 2010 స్కేళ్ళలో వేతన నిర్ణయం చేయాలన్నారు. జీవో -93 ప్రకారం 2010 పీఆర్‌సీ అమలు తరువాత జూనియర్ స్కేళ్ళలో వచ్చిన వేతన వ్యత్యాసం ఉన్నట్లయితే దానిని జూనియర్ వేతనానికి ఎక్కువగా నిర్ణయించబడిన రోజు నుంచి సీనియర్ వేతనం సమానం చేయబడునన్నారు.

● ప్రీ పోన్ మెంట్ -2010 వేతన స్కేళ్ళలో ప్రీపోన్ మెంట్ సౌకర్యం పునరుద్ధరించబడిందన్నారు. జీవో -52 ఆర్థికశాఖ ప్రకారం 2008 జూలై ఒకటికి ముందు జూనియర్ వేతనాన్ని, సీనియర్ వేతనాన్ని కన్నా తక్కువగా ఉండి 2010 వేతన స్కేళ్ళలో ఇరువురికి వేతనం ఒకే స్టేజ్ వద్ద వేతన స్థిరీకరణ జరిగి జూనియర్ ఇంక్రిమెంట్ తేదీ ముందుగా ఉన్నప్పుడు సీనియర్ ఇంక్రిమెంట్ తేదీని కూడా జూనియర్ ఇంక్రిమెంట్ తేదీకి ప్రీపోన్ చేస్తారన్నారు.

● స్వస్థలం నమోదు - సర్వీసు రిజిష్టర్ మొదటి పేజీలో నమోదు ఉన్న నివాస స్థలాన్ని బదిలీల సందర్భంలో స్వస్థలం పరిగణించటం వలన అనేక మంది నష్టపోవుట జరుగుతుందన్నారు. ఈ స్థితిలో ఎల్‌టీసీ వినియోగ సందర్భంలో స్వస్థలం నమోదు చేయుటకు జీవో -248 లో పేర్కొనిన విధానంచే ఉపాధ్యాయులు, ఉద్యోగులు బదిలీల సందర్భంలో స్వస్థలం నమోదు చేయటంలో పాటించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ మెమో 59852 ప్రకారం మహిళా ఉపాధ్యాయుని తన తల్లి దండ్రుల లేక భర్త స్వస్థలాల్లో ఏదో ఒక దానిని తన స్వస్థలంగా ప్రకటించుకోవచ్చు అని వీరయ్య తెలిపారు.



గల్లా మాధవి దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న తెలుగు తమ్ముళ్లు



మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభానిని సన్మానిస్తున్న నసీర్

నేతలకు అభినందనల వెల్లువ

● గల్లా మాధవి, నశీర్‌లకు శుభాకాంక్షలు తెలిపిన శ్రేణులు

గుంటూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో టీడీపీ- జనసేన- బీజేపీ కూటమి అభ్యర్థిగా తిరుగులేని విజయం సాధించిన ఎమ్మెల్యే గల్లా మాధవికి పార్టీ శ్రేణుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. పార్టీ పశ్చిమ కార్యాలయంలో బుధవారం ఉదయం నిర్వహించిన విజయోత్సవ వేడుకల్లో పెద్ద సంఖ్యలో తమ్ముళ్లు పాల్గొన్నారు. టీడీపీ శ్రేణులు బారులు తీరి, ఆమెను కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు తగినట్లుగా అభివృద్ధి, సంక్షేమంతో కూడిన పాలనను అందించేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.



లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న టీడీపీ నేత భరత్‌రెడ్డి



ఎమ్మెల్యే గల్లా మాధవికి శుభాకాంక్షలు తెలుపుతున్న మన్నవ మోహనకృష్ణ

● మంగళగిరి తిరుగులేని విజయం సాధించిన టీడీపీ యువనేత నారా లోకేశ్‌కు ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిసి టీడీపీ నాయకుడు భీమనాధం భరత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

● సార్వత్రిక ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గం కూటమి అభ్యర్థిగా గెలుపొందిన మొహమ్మద్ నసీర్ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. తనకు అవకాశం కల్పించి తిరుగులేని విజయాన్ని అందించిన పార్టీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్‌కు రుణపడి ఉంటానని ఈ సందర్భంగా లోకేశ్‌తో నసీర్ చెప్పారు. కాగా తన గెలుపులో కీలక పాత్ర వహించిన మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభానిని నసీర్ బుధవారం సన్మానించారు. ఆయన ఇంటికి వెళ్లి దుశ్శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.



కన్నాకు శుభాభినందనలు తెలుపుతున్న దేగల ప్రభాకర్, టీడీపీ నేతలు



టీడీపీ- జనసేన-బీజేపీ కూటమి తరుపున గుంటూరు పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ దంపతులు గుంటూరు మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఢిల్లీ వెళ్లిన పెమ్మసాని దంపతులు గల్లా జయదేవ్‌ను కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి ధన్యవాదాలు తెలిపారు.



బాపట్ల ఎమ్మెల్యే వేగేశ్న నరేంద్ర వర్మను కలిసి సత్కరించిన ఈడే మురళీకృష్ణ, సాయి శిరి శివ, సందేపూడి తిరు, గవిని నరేంద్ర

అడ్డుకుంటే తొక్కించేస్తా

● మాజీ ఎంపీ నందిగం అనుచరుడు దౌర్జన్యం



లారీలను అడ్డుకున్న లేమల్లె గ్రామస్థులు

అమరావతి, జూన్ 5: అధికారం కోల్పోయినా వైసీపీ అక్రమార్కుల దౌర్జన్యాలు తగ్గలేదని బుధవారం పల్నాడు జిల్లా అమరావతి మండలం లేమల్లె గ్రామంలో జరిగిన ఘటన తెలియజేస్తుంది. లేమల్లెకి చెందిన వెంకట్ అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను లారీలకు లోడింగ్ చేసి తరలించే ప్రయత్నం చేస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. దీంతో వెంకట్ తన తమ్ముడు మాజీ ఎంపీ నందిగం సురేష్ అనుచరుడైన లక్ష్మణ్‌ను పిలిపించుకుని ఇసుకను తరలించేందుకు పూనుకున్నాడు. లక్ష్మణ్ లారీ వద్దకు వచ్చి గ్రామస్థులను వీడియో తీస్తూ అడ్డుకుంటే లారీతో తొక్కిస్తానని బెదిరించాడు. దీంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం తెలియజేయడంతో సీఐ బ్రహ్మం అక్కడికి చేరుకోగా అప్పటికే లక్ష్మణ్ అక్కడ నుంచి పారిపోయాడు. ఇసుక లోడు చేసి ఉన్న లారీని అమరావతిలోని పోలీసు స్టేషన్‌కు తరలించి గ్రామస్థుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



టీడీపీ ఘన విజయం సాధించడంతో గుంటూరు వికాస్‌నగర్ లహరి హోమ్‌లో మహిళలు సంబరాలు చేసుకున్నారు. - గుంటూరు.

ప్రజాభీష్టానికి అనుగుణంగా పని చేయాలి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహమద్



టీడీపీ డివిజన్ నాయకులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహమద్

గుంటూరు(తూర్పు), జూన్ 5 : ప్రజలు అత్యంత విశ్వాసంతో గెలిపించారని, వారి అభీష్టానికి అనుగుణంగా పని చేయాలని ఎమ్మెల్యే నసీర్ అహమద్ అన్నారు. నసీర్ కార్యాలయంలో బుధవారం డివిజన్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు డివిజన్లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, దీనికి డివిజన్ నాయకులు సహకరించాలన్నారు. ప్రజలు తనకు పెద్ద బాధ్యత అప్పజెప్పారని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో 15వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు నూరె శ్రీనివాసరావు, పుట్టగుంటి వెంకటేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, సురేష్, పాటిబండ్ల శ్రీనివాసరావు, మీరావలీ, బీరం వెంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ ఈర్ల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు కోవెలమూడి శుభాకాంక్షలు



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రవీంద్ర

సార్వత్రిక ఎన్నికల్లో అఖండ మెజారిటీ సాధించి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న టీడీపీ అధినేత చంద్రబాబుకు టీడీపీ జోన్-5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర శుభాకాంక్షలు తెలిపారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో బుధవారం కలిసిన ఆయన చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేశారు. జోన్-5 పరిధిలోని 14 అసెంబ్లీ, 2 పార్లమెంటు స్థానాల్లో గెలుపొందామని చంద్రబాబుకు తెలియజేశారు.

● మాజీ మంత్రి కన్నాకు దేగల శుభాకాంక్షలు

పల్నాడు జిల్లా సత్తెనపల్లి నుంచి గెలుపొందిన మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణకు టీడీపీ నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులను కలిసి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.



కేక్ కట్ చేస్తున్న చుక్కపల్లి రమేష్ , న్యాయవాదులు

ఎన్డీఏ కూటమి న్యాయవాదుల విజయోత్సవాలు

గుంటూరు(లీగల్), జూన్ 5 : రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అఖండ విజయం సాధించటాన్ని పురస్కరించుకొని గుంటూరు జిల్లా కోర్టు వద్ద ఎన్డీఏ కూటమి న్యాయవాదులు బుధవారం మధ్యాహ్నం విజయోత్సవాలు నిర్వహించారు. బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కోర్టుకు హాజరైన కక్షిదారులకు, కోర్టు సిబ్బందికి మిఠాయిలు పంచిపెట్టారు. టీడీపీ గుంటూరు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు చుక్కపల్లి రమేష్, కార్యదర్శి శ్రీరామ్ రాజీవ్ ఆనంద్, జనసేన జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు నరెడ్ల అమ్మి నాయుడు, జనసేన రాష్ట్ర నాయకుడు చెపాకుల కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర నాయకులు జూపూడి రంగరాజు, సీనియర్ న్యాయవాది నీలం రామ్మోహన్ రావు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కేవీకే సురేష్, పాలడుగు వెంకటేశ్వర్లు, బార్ అసోసియేషన్ కార్యదర్శి గురజాల అనూరాధ, మాజీ ఏపీపీలు కట్టా కాళిదాస్, వేమూరి శ్రీనివాసరావు, కొప్పాకుల నారాయణ, సుధాకర్, రమణ తదితరులతో పాటు వందలాదిమంది న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్క విద్యార్థి మొక్కలు పెంచాలి

గుంటూరు(కార్పొరేషన్), జూన్ 5 : ప్రతి ఒక్క విద్యార్థి మొక్కలు పెంచాలని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ సెక్రెటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో మొక్కలను నాటిన సందర్భంలో విష్ణువర్ధన్ మాట్లాడుతూ 'పుడమి రక్షణ మన భవిష్యత్తుకు శ్రీరామరక్ష' అని, ప్రకృతిని ప్రేమిస్తూ, పర్యావరణాన్ని రక్షిస్తూ, మనందరం ముందుకు సాగితే భావితరాల మనుగడ సులభతరం అవుతుందని తెలిపారు. పాఠశాలలో ఉపాధ్యాయ బృందం పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను గురించిన నినాదాలను, ప్లకార్డుల రూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాద రావు, పాఠశాల అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపల్ కర్లపూడి పార్వతి దేవి, సీనియర్ కోఆర్డినేటర్ డి.దుర్గా శ్యామ్, ప్రీ ప్రైమరీ కో ఆర్డినేటర్ శ్రీదేవి పాల్గొన్నారు.



పర్యావరణంపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

SCHOLARSHIP ALERT

Description: Under the CSR initiative on Education & Livelihood by the Kotak Mahindra Group Companies, Kotak Education Foundation invites applications for Kotak Junior Scholarship 2024-25 from Class 10 passed students within the Mumbai Metropolitan Region.

Kotak Junior Scholarship

Eligibility: Applicants must have obtained over 85% marks in their Class 10 board examination (SSC/CBSE/ICSE) in 2024.

- They must have secured admission in Class 11 at junior colleges/schools for Arts, Commerce or Science streams in the Mumbai Metropolitan Region (MMR) for the academic year 2024-25.
- The annual family income of applicants must be INR 3,20,000 or below.
- Students must reside within the Mumbai Metropolitan Region.

Prizes & Rewards: Scholarship of INR 3,500 per month along with mentorship support, academic assistance, career guidance, and exposure visits.

Last Date to Apply: 30-06-2024

Application mode: Online *Short Url:* www.b4s.in/aj/KJSP2

దిక్సూచి

Description: The global Aspire Leaders Program is a fully funded 14-week online leadership program offered by the Aspire Institute. It has been designed to help students unlock their potential and become well-rounded professionals.

Aspire Leaders Program

Eligibility: This program is open for students within the age group of 18-29 years. The annual household income of the applicants should be less than 8,00,000. Only first-generation learners are eligible to apply for the program.

Participants who have enrolled in or completed an undergraduate program in the last three years can apply. Applicants must have an intermediate level of proficiency in English.

Prizes & Rewards: Free access to training modules, live sessions by Havard faculty, and much more

Last Date: 03-07-2024 *Application:* Online

Short Url: www.b4s.in/aj/ALPS1

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..

సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/la52NWCలో చదవండి.

Mirae Asset Foundation Scholarship Program



Description: Mirae Asset Foundation invites applications from students who are currently pursuing undergraduate or postgraduate courses across India.

Eligibility: Open to students who are currently pursuing undergraduate or postgraduate courses across India. Applicants must have scored at least 60% in the previous academic year. The annual family income of the applicants must not exceed INR 8,00,000.

Prizes & Rewards: Scholarships up to INR 50,000

Last Date to Apply: 26-06-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/MAFS1

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అగ్రికల్చర్, ఆర్గానిక్ అగ్రికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ విభాగాలు ఉన్నాయి. అగ్రికల్చరల్ స్ట్రీమ్‌లో తెలంగాణ పాలిసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలల్లో 260 సీట్లు, అనుబంధ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో 540 సీట్లు ఉన్నాయి. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివిన విద్యార్థులకు ప్రతి విభాగంలో 60 శాతం సీట్లు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

జయశంకర్ వ్యవసాయ వర్సిటీలో డిప్లొమాలు

డిప్లొమా ఇన్ అగ్రికల్చర్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీ అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 240 సీట్లు ఉన్నాయి. జోగిపేటలో బాలికల పాలిటెక్నిక్; బసంత్‌పూర్, జమ్మికుంట, మల్‌తుమ్మెదలలో బాలుర పాలిటెక్నిక్ కాలేజీలు ఉన్నాయి. వీటితో పాటు పాలెం, పొలాస, కంపసాగర్, మధిర, సిరిసిల్లా, రుద్రూర్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఒక్కోదానిలో 20 సీట్లు; నారాయణపేట పాలిటెక్నిక్ కళాశాలలో 40 సీట్లు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో మొత్తం 390 సీట్లు ఉన్నాయి.

డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. సంగారెడ్డి-కందిలోని అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్‌లో 20 సీట్లు ఉన్నాయి. మెదక్-తునికి, ఖమ్మం-సత్తుపల్లి, సంగారెడ్డి-తుర్కాల ఖానాపూర్‌లలో ఉన్న అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఒక్కోదానిలో 30 చొప్పున మొత్తం 90 సీట్లు ఉన్నాయి.

డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. వికారాబాద్-గింగుర్తిలోని ఏకలవ్య ఆర్గానిక్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: ఆంధ్రప్రదేశ్/తెలంగాణ స్టేట్ బోర్డ్ నిర్వహించే పదోతరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఎన్ఐఓఎస్, తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీల అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 35 శాతం మార్కులు తప్పనిసరి. అగ్రికల్చరల్ విభాగంలో తెలంగాణ పాలిసెట్ 2024 ర్యాంక్ పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 15 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయో పరిమితి 22 ఏళ్లు.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **రిజిస్ట్రేషన్ ఫీజుకు చివరి తేదీ:** జూన్ 25
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **ఆన్‌లైన్ దరఖాస్తులో కరెక్షన్స్:** జూన్ 27
- **వెబ్‌సైట్:** diploma.pjtsau.ac.in

ప్రియమైన మామయ్యకు...

చంద్రబాబు, బాలకృష్ణకు జూనియర్ ఎన్టీఆర్ అభినందనలు



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తెలుగు దేశం పార్టీలోని పలువురు నేతలకు జూనియర్ ఎన్టీఆర్ అభినందనలు తెలిపారు. బుధవారం ఉదయం ఆయన సోషల్ మీడియా వేదికగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడిని మామయ్య, బాలకృష్ణను బాబాయ్, పురందేశ్వరిని అత్త అని సంబోధిస్తూ ఈ ట్వీట్ చేయడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. "ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో చరిత్రాత్మక విజయం సాధించిన ప్రియమైన మామయ్య నారా చంద్రబాబు నాయుడుకు నా హృదయపూర్వక అభినందనలు. మీ ఈ విజయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపున నడిపిస్తుందని ఆశిస్తున్నాను. మంగళగిరిలో అద్భుతమైన మెజారిటీతో గెలిచిన నారా లోకేశ్‌కి, మూడోసారి హిందూపూర్‌లో జయభేరి మోగించిన బాలకృష్ణ బాబాయికి, ఎంపీలుగా గెలిచిన భరత్, పురందేశ్వరి అత్తకి నా శుభాకాంక్షలు. అలాగే ఇంతటి ఘనవిజయాన్ని సాధించిన పవన్‌కల్యాణ్‌కు కూడా నా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని ఎక్స్‌లో పేర్కొన్నారు.



తొలిసారి ఇటువంటి పాత్ర చేశా

టాలీవుడ్ చందమామగా పేరు తెచ్చుకున్న స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన పవర్‌ఫుల్ యాక్షన్ థ్రిల్లర్ 'సత్యభామ'. నవీన్‌చంద్ర కీలక పాత్ర పోషించగా, సుమన్ చిక్కాల దర్శకత్వం వహించారు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించారు. రేపు ఈ సినిమా విడుదలవుతున్న సందర్భంగా కాజల్, చిత్ర నిర్మాతలు బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి మీడియాతో ముచ్చటించారు "దర్శకుడు సుమన్ చిక్కాల ఈ సినిమా కథ చెప్పిన వెంటనే ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ఓకే చేశా. ఒక పోలీసాఫీసర్ ఎమోషనల్ జర్నీ ఇది. నేను ఇప్పటివరకూ ఎన్నో పాత్రలు చేశాను.. కానీ ఇటువంటి ఎమోషనల్ యాక్షన్ రోల్‌లో నటించడం ఫస్ట్ టైమ్. ఇందులోని యాక్షన్ సీక్వెన్స్ అన్నీ సహజంగా ఉంటాయి. సస్పెన్స్ థ్రిల్లర్ మూవీస్ ఇష్టపడే ప్రేక్షకులకు ఈ చిత్రం చాలా బాగా నచ్చుతుంది. మీరు ట్రైలర్‌లో చూసిన దాని కంటే ఎన్నో ట్విస్ట్‌లు సినిమాలో ఉంటాయి. శ్రీచరణ్ పాకాల ఈ సినిమాకు అద్భుతమైన సంగీతంతో పాటూ అదిరిపోయే నేపథ్య సంగీతం ఇచ్చారు" అని చెప్పారు.

హేమను సస్పెండ్ చేస్తున్న 'మా'?



రేవ్ పార్టీ కేసులో అరెస్టైన నటి హేమపై మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ ('మా') కమిటీ క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. ఆమె దోషిగా తేలితే చర్యలు తప్పవని 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు ఇటీవల పేర్కొన్నారు. అందులో భాగంగా ఆయన కమిటీ సభ్యులు అభిప్రాయాలను కోరినట్లు తెలిసింది. మెజారిటీ సభ్యులు హేమను సస్పెండ్ చేయాల్సిందేనని వెల్లడించినట్లు సమాచారం. రేవ్ పార్టీ కేసు నుంచి హేమకు క్లీన్ చిట్ వచ్చేంత వరకూ 'మా' నుంచి సస్పెండ్ చేసేందుకు 'మా' కార్యవర్గం సిద్ధమైనట్లు తెలిసింది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన గురువారం వెల్లడయ్యే అవకాశం ఉంది.

24 గంటల కస్టడీ

ఇదిలా ఉంటే జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న హేమను సీసీబీ పోలీసులు బుధవారం కస్టడీకి తీసుకున్నారు. ఆనేకల్ జేఎంఎఫ్‌సీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసి, 24 గంటలపాటు విచారణ కోసం అనుమతి తీసుకున్నారు. సీసీబీ పోలీసులు హేమను అరెస్టు చేసిన రోజే ప్రాథమికంగా విచారించారు. మరింత సమాచారం కోసం ఆమెను కస్టడీకి తీసుకున్నారు.

సెకండ్ ఇన్నింగ్స్ సూపర్

రాహుల్



కార్తికేయ గుమ్మకొండ, రాహుల్ టైసన్ హీరోలుగా నటించిన 'భజే వాయువేగం' చిత్రం ఇటీవల విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. దర్శకుడు శేఖర్ కమ్ముల రూపొందించిన 'హ్యాపీ డేస్' చిత్రంలో నలుగురు హీరోల్లో ఒకరిగా నటించి, 'టైసన్' పాత్రతో మంచి గుర్తింపు తెచ్చుకున్న రాహుల్ 'భజే వాయువేగం' సినిమాతో సెకండ్స్ ఇన్నింగ్స్ ప్రారంభించారు. అన్ని వర్గాల ప్రేక్షకులూ చిత్రాన్ని బాగా ఆదరిస్తున్నారనీ, తన పాత్రకు కూడా మంచి స్పందన వస్తోందని రాహుల్ 'చిత్రజ్యోతి'కి తెలిపారు. 'ఈ సినిమా విడుదలకు ముందు ఫ్రెండ్స్, ఫ్యామిలీ మెంబర్స్, యూనిట్ సభ్యులందరం కలసి చూశాం. సినిమా బాగా వచ్చిందనీ, తప్పకుండా హిట్ అవుతుందని మా అందరికీ నమ్మకం కలిగింది. అదే అభిప్రాయాన్ని ప్రేక్షకులు కూడా వ్యక్తం చేస్తున్నారు. నా సెకండ్ ఇన్నింగ్స్ మరో మంచి సినిమాతో ప్రారంభించినందుకు ఆనందంగా ఉంది' అన్నారు రాహుల్.

ఈ సినిమాలో అవకాశం ఎలా వచ్చిందని అడిగితే 'యూవీ క్రియేషన్స్ ఓ చిన్న సినిమా ప్లాన్ చేస్తూ నాకు హీరోగా అవకాశం ఇచ్చింది. ఆ సినిమా పేరు 'గోడ' అది నిర్మాణంలో ఉండగానే యూవీ క్రియేషన్స్ నిర్మాతలే 'భజే వాయు వేగం' సినిమా ప్రారంభించారు. కార్తికేయ హీరోగా నటించే ఆ సినిమాలో సెకండ్ హీరో కోసం వెదుకుతుంటే ఆ చిత్ర దర్శకుడు ప్రశాంత్‌రెడ్డికి నా పేరు సూచించారు యూవీ క్రియేషన్స్ అధినేతలు. 'గోడ' సినిమాలో నేను చేసిన వర్క్ చూసి సంతృప్తి చెంది ప్రశాంత్‌రెడ్డి ఇందులో అవకాశం ఇచ్చారు. ఒకే సంస్థలో రెండు మంచి చిత్రాలు రావడం.. రియల్లీ ఐయామ్ లక్కీ' అని చెప్పారు రాహుల్. ఈ సినిమాతో కార్తికేయ రూపంలో మంచి స్నేహితుడు లభించాడనీ, సినిమాలో తామిద్దరి మధ్య మంచి కెమిస్ట్రీ కుదిరిందని ఆయన తెలిపారు. కార్తికేయ, తను, తనికెళ్ల భరణి మధ్య వచ్చే సన్నివేశాలు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నాయని చెప్పారు. తన కొత్త సినిమాల గురించి వివరిస్తూ 'గోడ' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. సెకండ్ ఇన్నింగ్స్‌లో నాకు అది సెకండ్ ఫిల్మ్ అవుతుంది. మూడో సినిమా ఇప్పుడు నిర్మాణంలో ఉంది. వార్ నేపథ్యంలో భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకొనే ఆ చిత్రాన్ని నా స్నేహితుడే నిర్మిస్తున్నారు. అది నా డ్రీమ్ ప్రాజెక్ట్. చాలా కాలం నుంచి దాని మీద వర్క్ చేసి ఇప్పుడు షూటింగ్ ప్రారంభించాం. శివ అని కొత్త దర్శకుడిని పరిచయం చేస్తున్నాం. ఇందులో నేను సోలో హీరోగా నటిస్తున్నాను. ఆర్మీలో ఆయుధాలను ఎలా ఉపయోగిస్తారో, వాళ్ల ట్రైనింగ్ ఎలా ఉంటుందో నాలుగు నెలల పాటు ఓ ఆర్మీ పర్సన్ దగ్గర శిక్షణ తీసుకున్నాను. దీని తర్వాత టైమ్ ట్రావెల్ ఫిల్మ్ చేస్తున్నాను. ఈ చిత్రాలన్నీ నాకు మంచి పేరు తెస్తాయనే నమ్మకంతో ఉన్నాను' అన్నారు రాహుల్.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ZZ1WLfw లో చదవండి.



కార్మికులతో కలిసి విజయోత్సవ కేకును కట్‌చేస్తున్న వీరవల్లి మురళి, నాగభూషణం యూనియన్ నాయకులు

కూటమి గెలుపునకు కార్మికులు కృషి

● తెలుగునాడు ఆటోయూనియన్ గౌరవాధ్యక్షుడు మురళి

తెనాలి రూరల్, జూన్ 5: కూటమి భారీ మెజారిటీతో గెలుపొందేందుకు కార్మికులు చేసిన కృషి అభినందనీయమని గణేష్‌యూత్ కన్వీనర్, తెలుగునాడు ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు వీరవల్లి మురళి అన్నారు. బుధవారం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో తెలుగునాడు ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూటమి విజయోత్సవ వేడుకలకు మురళి ముఖ్య అతిథిగా హాజరై విజయోత్సవ కేక్‌ను కార్మికులతో కలిసి కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ కూటమి గెలుపుతో రాష్ట్రానికి పట్టిన పీడ విరగడయిందని ప్రజలకు మంచిరోజులు వచ్చాయన్నారు. ఒక్కఛాన్స్ అంటూ అధికారం చేపట్టిన జగన్ మరోచాన్స్ ప్రజలు ఇచ్చేందుకు భయపడేలా పాలన చేశాడని విమర్శించారు. ప్రజలందరికీ మంచిచేసే విజనరీ కలిగిన నాయకుడు చంద్రబాబు పాలనలో అన్నిరకాల ప్రజలు సంతోషంగా ఉంటారని అభివృద్ధి, సంక్షేమం రాష్ట్రంలో పరుగులు తీయనున్నదని స్పష్టం చేశారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌ను ప్రజలు కనీవినీ ఎరుగని విధంగా భారీ మెజారిటీతో గెలిపించారని ఆయన నాయకత్వంలో తెనాలి దినదినాభివృద్ధితో దూసుకుపోనున్నదన్నారు. ఆయన గెలుపునకు కృషిచేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. తొలుత ఆటో యూనియన్ కార్మికులు వీరవల్లి మురళిని దుశ్శాలువాలతో సత్కరించి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అంగలకుదురు ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, యూనియన్ సభ్యులు షేక్ సుభాని, రాజు, ప్రభాకర్, షేక్ సైదా, ప్రసాద్, రాజమోహన్, ప్రవీణ్, రత్నకుమార్, ఎన్వీ ప్రసాద్, గణేష్‌యూత్ సభ్యులు బొద్దులూరి వేణు, సాయిగిరి, ముప్పవరపు సాంబశివరావు, ఎల్ఎమ్ఎల్ ఖాదర్, షేక్ నిజాం, సలార్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.



యాలుకలతో తయారుచేయించిన ప్రత్యేక దండతో మనోహర్‌ను సత్కరిస్తున్న వీరవల్లి మురళి, కనగాల నాగభూషణం తదితరులు

మనోహర్‌ను సత్కరించిన వీరవల్లి మురళి

తెనాలి రూరల్, జూన్ 5: తెనాలి అసెంబ్లీ కూటమి అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలుపొందిన నాదెండ్లమనోహర్‌ను గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి ఘనంగా సత్కరించారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం నాదెండ్లమనోహర్‌ను కలిసిన వీరవల్లి మురళి, కనగాల నాగభూషణం, గణేష్‌యూత్ సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. యాలుకలతో ప్రత్యేకంగా తయారుచేయించిన దండను మనోహర్ మెడలో వేసి దుశాలువాలతో ఘనంగా సత్కరించి ఆయనపై ఉన్న అభిమానాన్ని చాటారు. మనోహర్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కూటమి అభ్యర్థుల గెలుపుకు వీరవల్లి మురళి, నాగభూషణంలు చేసిన కృషిని మనోహర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ తెనాలి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను ప్రణాళికా బద్ధంగా పరిష్కరించి ప్రశాంతవాతావరణంలో ప్రజలు జీవించేలా అన్ని రకాల చర్యలు చేపడతామని మనోహర్ స్పష్టం చేశారు. తనను అత్యంత మెజారిటీతో గెలిపించిన నియోజవర్గ ప్రజలందరికి కృతజ్ఞతలు తెలిపారు. యూత్ సభ్యులు బొద్దులూరు వేణు, గొల్లపూడి సాయిగిరి, ఎల్ఎమ్ఎల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి తెలుగు మహిళల పాలాభిషేకం


తెనాలి రూరల్, జూన్ 5: వైసీపీ అరాచకపాలన అంతం కావడంతో రాష్ట్రానికి రామరాజ్యం వచ్చిందని టీడీపీ కౌన్సిలర్ బోయపాటి అరుణ అన్నారు. బుధవారం పట్టణంలోని చెంచుపేట ఎన్టీఆర్ విగ్రహానికి జాస్తి సరళ, సూరపనేని అనురాధ పలువురు తెలుగు మహిళలు కలిసి పాలాభిషేకం చేశారు. అనంతరం రావి భగత్‌దత్, రావి సూర్యకిరణ్‌తేజల ఆధ్వర్యంలో కూటమి విజయోత్సవ కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కోగంటి భాస్కరరావు, కోగంటి వెంకట కోటేశ్వరరావు, కోగంటి రాజా, రావి సుబ్బారావు, రాయపాటి శ్రీనివాసరరావు, పలువురు ఉమ్మడి పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న తెలుగు మహిళలు

ఓటమికి గల కారణాలను విశ్లేషించి సరిచేసుకుంటాం

- మాజీ ఎమ్మెల్యే శివకుమార్



తెనాలి రూరల్, జూన్ 5: అందరికీ సంక్షేమ పథకాల లబ్ధిని చేరువచేశాం.. అయినా సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి చవిచూశాం.. అసలు ఎందుకు ఇలా జరిగిందో.. ఎక్కడ లోపాలు ఉన్నాయో వాటిపై విశ్లేషించి సరిచేసుకుని వచ్చే ఎన్నికల్లో గెలుపునకై పోరాడతామని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నివాసంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని రీతిలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించామని తాను ఎమ్మెల్యేగా ప్రజలందరి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం జరిగిందన్నారు. అయినా తాను అధికారం లోల్పోవడం ఆశ్ర్యానికి గురిచేసిందని తనకు 75వేల మంది ఓట్లు వేశారని వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని నాయకులు కార్యకర్తలు అధైర్యపడవద్దని రానున్న ఎన్నికల్లో గెలుపునకై మరింత పట్టుదలతో పనిచేయాలని శివకుమార్ సూచించారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల్లోనే అనునిత్యం ఉంటూ వారికి అండగా నిలుస్తానని మాజీ ఎమ్మెల్యే శివకుమార్ స్పష్టం చేశారు. పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట జూన్ 5: స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నదాత సుఖీభవ తెనాలి వారి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. బుధవారం అన్నదాత సుఖీభవ సభ్యులు చేతన్ రాజ్ కొఠారి వారి కుటుంబ సభ్యుల సహకారంతో మజ్జిగను, తాగునీరును పాదచారులకు, పట్టణ ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుర్రా శ్రీనివాసరావు, వీవీ ప్రతాప్, అబ్దుల్ రజాక్, పోతరాజు, బాలునాయక్, శ్రీను, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కోలాహలంగా ధూళిపాళ్ళ నివాసం

పొన్నూరు టౌన్, జూన్ 5: శాసనసభ ఎన్నికల్లో పొన్నూరు నుంచి ఘన విజయం సాధించిన ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ స్వగృహం మంగళవారం రాత్రి నుంచే విజయోత్సవాలకు వేదికగా మారింది. నరేంద్ర కుమార్ ఆర్వో నుంచి డిక్లరేషన్ ఫాం అందుకుని బయలుదేరిన ప్రాంతం కాకాని మండలం నుంచి పొన్నూరు మండలంలోని చింతలపూడి స్వగృహం చేరుకునేంత వరకు సుమారుగా 3 గంటలకు పైగా సమయం పట్టింది కార్యకర్తలు గ్రామ, గ్రామాన వేచివుండి దిష్టితీసి మంగళహారతులు పట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. దారిపొడవునా బాణ సంచా పేలుళ్లతో నరేంద్ర కుమార్‌కు పొన్నూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన శ్రేణులు అఖండ స్వాగతం పలికారు. అర్ధరాత్రి రెండు గంటల వరకు నరేంద్రకుమార్ స్వగృహం టీడీపీ శ్రేణుల సంబరాలతో హోరెత్తింది. ఉదయం తెల్లవారు నుంచే నరేంద్రకుమార్ స్వగృహానికి శ్రేణులు బారులుతీరారు. ప్రతి ఒక్కరూ అఖండ విజయం సాధించిన నరేంద్ర కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ తమ ఆనందాన్ని పంచుకున్నారు.



ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న వికలాంగుల సంఘాల నాయకులు

మొక్కులు తీర్చుకున్న మహిళలు



వర్సిటీ మెయిన్ గేటు ఎదుట కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు

చేబ్రోలు, జూన్5: తెలుగుదేశం పార్టీ విజయం తోపాటు పొన్నూరులో ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ 6వ సారి ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా బుధవారం నారాకోడూరు మహిళలు మొక్కుబడులు తీర్చుకున్నారు. గ్రామంలోని శివాలయం, గ్రామ దేవత కట్లమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో పొంగళ్లను నైవేద్యంగా సమర్పించి తమ మొక్కుబడులు తీర్చుకుని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నారాకోడూరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే వడ్లమూడి గ్రామానికి చెందిన మహిళలు గ్రామం నుంచి పాదయాత్రగా క్వారీలోని బాలకోటేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు.

ఏఎన్‌యూ ఎదుట సంబరాలు

పెదకాకాని, జూన్ 5 : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని టి.ఎన్.టి.యు.సి. ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారం చేపట్టి నారా చంద్రబాబు నాయుడు నాలుగవసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న సందర్భంగా విశ్వవిద్యాలయంలోని ప్రధాన ముఖ ద్వారం వద్ద కేకును కట్ చేసి మిఠాయిలు బుధవారం పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్య సింహాచలం మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగ వ్యతిరేక విధానాల వలనే ఓటమిపాలైందని టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఉద్యోగుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తారని తెలిపారు. టి.ఎన్.టి.యు.సి. అధ్యక్షుడు వి.విష్ణుప్రసాద్ మాట్లాడుతూ టీడీపీకి ఇంత పెద్ద విజయాన్ని అందించిన ప్రజలకు ముఖ్యంగా ఉద్యోగులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వానికి ఉద్యోగులకు మధ్య వారధిగా టి.ఎన్.టి.యు.సి. పనిచేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పాల్గొన్న ప్రతి ఒక్కరూ స్థానిక శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ రాబోయే మంత్రివర్గంలోఆయనకు స్థానం ఉండాలని ఆకాంక్షించారు. ప్రధాన ముఖ ద్వారం వద్ద కేక్ కటింగ్ అనంతరము టి.ఎన్.టి.యు.సి. ఆధ్వర్యంలో వర్సిటీలోని అన్ని విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగులను కలిసి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తూ మిఠాయిలు అందించారు. కార్యక్రమంలో ఆచార్య రామ్‌చంద్రన్, మండూరి వెంకటరమణ, నూతక్కి వెంకటేశ్వర్లు, నేలపాటి నాగేశ్వరరావు, ఎన్.శ్రీనివాసరావు, ఎన్ కోటేశ్వరరావు,టి ఎన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర నాయకులు అభిషేక్,ఆరే గోపి,శరత్ యాదవ్, వి.గోపి, కనకరాజు, డ్రైవర్లు శ్రీనివాసరావు ,సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో టీడీపీకి తిరుగులేని మద్దతు

● పొన్నూరు నియోజకవర్గంలో 54 గ్రామాల్లో 48 టీడీపీకి మెజార్టీ

● పెదకాకాని, చేబ్రోలు మండలాల్లో అత్యధిక మెజార్టీలు

● చేబ్రోలు మండలం క్లీన్ స్వీప్

పొన్నూరు టౌన్, జూన్ 5: శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అఖండ మెజార్టీని కట్టబెట్టిన పొన్నూరు నియోజకవర్గంలోని అత్యధిక గ్రామాలు టీడీపీ కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌కే మెజార్టీని ఇచ్చాయి. పొన్నూరు నియోజకవర్గంలో మూడు మండలాల్లో 54 గ్రామాలు ఉండగా తెలుగుదేశం పార్టీకి 47 గ్రామాలు సంపూర్ణ మెజార్టీ లభించింది. పెదకాకాని మండలంలో 12 గ్రామాలు ఉండగా కేవలం వెనిగండ్ల, నంబూరు, తంగెళ్లమూడి గ్రామాలో మాత్రమే వైసీపీ అభ్యర్థికి స్వల్ప మెజార్టీలు లభించాయి. పెదకాకాని నియోజకవర్గంలో మేజర్ పంచాయతీ అయిన పెదకాకాని గ్రామంలో తెలుగుదేశం పార్టీకి 3948 ఓట్ల అత్యధిక మెజార్టీ లభించింది. కొప్పురావూరు 1924 ఓట్లు, అగతవరపాడు 145, గోళ్లమూడి 188, తక్కెళ్లపాడు 2973, రామచంద్రపురం 244, ఉప్పలపాడు 1120, వెంకటకృష్ణపురం 525, అనమర్లపూడి 185 ఓట్ల మెజార్టీని తెలుగుదేశం పార్టీ పొందింది. పెదకాకాని మండలంలో ఉద్దండులైన వైసీపీ నాయకులు అయోధ్యరామిరెడ్డి వంటి వారు కీలకంగా పనిచేసినప్పటికి తెలుగుదేశం పార్టీకి 10,592 ఓట్లు మెజార్టీ లభించటం విశేషం.

చేబ్రోలు మండలంలో 13 గ్రామాలు ఉండగా 13 గ్రామాల్లోనూ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌కు మెజార్టీ లభించింది. శేకూరు గ్రామంలో 480 ఓట్లు, వీరనాకునిపాలెంలో 2, వడ్లమూడిలో 1458 ఓట్లు, శలపాడులో 700, సుద్ధపల్లిలో 1198 ఓట్లు, వేజండ్లలో 212 ఓట్లు, నారాకోడూరులో 1341 ఓట్లు, గుండవరం గ్రామంలో 508 ఓట్లు, గొడవర్రు గ్రామంలో 150 ఓట్లు, చేబ్రోలులో 2886 ఓట్లు, శ్రీరంగపురంలో 214 ఓట్లు, తోటపాలెంలో 138 ఓట్లు, మంచాలలో 390 ఓట్లు టీడీపీకి మెజార్టీ వచ్చాయి. చేబ్రోలు గ్రామంలోని కొత్తరెడ్డిపాలెం, పాతరెడ్డిపాలెం రెండు ప్రాంతాలలో 508 ఓట్లు తెలుగుదేశం పార్టీకి మెజార్టీ రావటం విశేషం. చేబ్రోలు మండలంలో నరేంద్ర కుమార్‌కు 12,317 ఓట్ల మెజార్టీ లభించింది.

పొన్నూరు రూరల్ మండలంలో....

పొన్నూరు రూరల్ మండలంలో 29 గ్రామాలు ఉండగా కేవలం 7 గ్రామాల్లోనే వైసీపీకి స్వల్ప ఆధిక్యాలను మాత్రమే దక్కించుకుంది. తెలుగుదేశం పార్టీకి జూపూడిలో 68 ఓట్లు, గోళ్లమూడిపాడులో 189 ఓట్లు, బ్రాహ్మణకోడూరులో 359 ఓట్లు, వెల్లలూరులో 339ఓట్లు, ఆరెమండలో 599 ఓట్లు, పచ్చలతాడిపర్రులో 306 ఓట్లు, దొప్పలపూడిలో 417 ఓట్లు, తాళ్లపాలెంలో 31 ఓట్లు, కట్టెంపూడిలో 558 ఓట్లు, అల్లూరులో 223 ఓట్లు, కొండముదిలో 145 ఓట్లు, వడ్డిముక్కల్లో 64 ఓట్లు, పెదపాలెంలో 98ఓట్లు, వల్లభరావుపాలెం గ్రామంలో 186 ఓట్లు, ఉప్పరపాలెంలో 419ఓట్లు, సీతరామపురంలో 188ఓట్లు, కసుకర్రులో 405 ఓట్లు, చింతలపూడిలో 788 ఓట్లు, మాచవరంలో 325 ఓట్లు, ములుకుదురులో 404 ఓట్లు, నండూరులో 319 ఓట్లు, ఇట్టికంపాడులో 296 ఓట్లు మెజార్టీ లభించింది. మొత్తం రూరల్ మండలంలో 4013 ఓట్ల మెజార్టీ తెలుగుదేశం పార్టీకి వచ్చాయి. పొన్నూరు పట్టణంలో 5993 ఓట్ల మెజార్టీని తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సాధించారు.

టీడీపీకి 56.95 శాతం ఓట్లు

పొన్నూరు శాసన సభ ఎన్నికల్లో మొత్తం 1,96,010 ఓట్లు పోలవ్వగా 86.29 శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌కు 56.95 శాతం అంటే 1,10,410 ఓట్లు లభించాయి. వైసిపి అభ్యర్థికి 39.97 శాతం 77,497 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ అభ్యర్థికి 2400 ఓట్లు లభించగా 1.24 శాతం వచ్చింది. మిగిలిన ఏ అభ్యర్థి కూడా ఒక శాతం ఓటు దాటలేదు. నోటాకు ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ల కలిసి 1248 ఓట్లు పోలయ్యాయి. బీఎస్పీ అభ్యర్థికి మాత్రమే వెయ్యి ఓట్లు దాటి 1451 ఓట్లు లభించాయి. ఎన్నికల బరిలో 14 మంది పోటీలో నిల్వగా కేవలం ప్రధాన పార్టీల మధ్య మాత్రమే పోరు జరిగి మిగిలిన అభ్యర్థులు ఎవ్వరికీ డిపూజిట్లు కూడా లభించలేదు.



ప్రపంచ పర్యావరణ దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈవో జయంతిబాబు తదితరులు

పర్యావరణాన్ని కాపాడుకుందాం..

● మండల విద్యాశాఖాధికారి జయంతిబాబు

తెనాలి, మారీసుపేట జూన్ 5: పర్యావరణంపై ప్రతివక్కరూ అవగాహన కలిగి పర్యావరణాన్ని కాపాడుకుందామని మండల విద్యాశాఖాధికారి వి జయంతిబాబు అన్నారు. స్థానిక కొత్తపేటలోని మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద మండల విద్యాశాఖ వారు ప్రపంచ పర్యావరణ దినోత్సవ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖాధికారి వి.జయంతిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ ఆదేశాల మేరకు విద్యార్థులకు పర్యావరణ ప్రాముఖ్యం బోధించడంతో పాటు వారిలో పర్యావరణ పరిరక్షణ పెంపొందించేలా పాఠశాల స్థాయిలో ఏకో క్లబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. పర్యావరణ దినోత్సవంకు సంబంధించి ఈ నెల 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు వివిధ రకాల కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇందుకు సంబంధించిన రికార్డులను నిర్వహించాలని ప్రధానోపాధ్యాలకు సూచించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవ ర్యాలీని దేవిచౌక్ వరకు నిర్వహించారు. అందిరితో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నివారించేందుకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

తెనాలి క్రైం, జూన్ 5: నానాటికి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. దీనిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో సభ్యులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్ మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు అవి చెట్లుగా పెరిగే వరకు వాటిని పరిరక్షించుకోవాలని, ముఖ్యంగా విద్యార్థులు, యువత, ఉపాధ్యాయులు, వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు దీన్ని ఉద్యమంగా చేపట్టాలన్నారు. వివిధ రకాలైన విత్తనాలను సేకరించి వర్షాకాలం ముందు ఖాళీ స్థలాల్లోను, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లోను, బాటల ఇరువైపులా వీటిని నాటి సంరక్షించుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు కిషోర్, పుణ్యవతి, సుధాకర్, సీనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, మద్ది మల్లిఖార్జునరావు, పొన్నం విజయ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు, మహేష్, గుమ్మడి రాజు, సురేష్, భూషణం, బాబావలి, హుస్సేన్, కోర్టు సిబ్బంది, న్యాయవాదుల గుమస్తాలు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణను పరిరక్షించండి: ఎంఈవో

కొల్లిపర, జూన్ 5 : చెట్లను పెంచడం వలన పర్యావరణను పరిరక్షించుకోవచ్చునని ఎంఈవో సాల్మన్‌రాజ్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖాధికారులు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సాల్మన్‌రాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని పెంచటం వలన ప్రజారోగ్యానికి మేలు జరుగుతుందన్నారు. ఎంఈవో ఝాన్సీలత మాట్లాడుతూ వృక్షో రక్షిత రక్షితః అనే నినాదాన్ని ప్రజలు అమలు చేయాలన్నారు. వర్షాలు పడాలంటే చెట్లను తప్పని సరిగా పెంచాలని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఈదా సాంబిరెడ్డి, సీఆర్పీలు మురళి, అలేఖ్య, స్వరూపరాణి, వై. రాంబాబు, రమేష్‌బాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

రెండు ఈవీఎంల మొరాయింపు... వాటిని వదిలేసి ఫలితం వెల్లడి

తెనాలి అర్బన్, జూన్ 5: నిన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ఓట్ల లెక్కింపులో 185, 223వ పోలింగ్ స్టేషన్‌ల కంట్రోల్ యూనిట్లు ఫలితం లెక్కించేందుకు మొరాయించాయి. దీంతో ఈ పోలింగ్ స్టేషన్‌లలో ఉన్న మొత్తం ఓట్ల కన్నా అభ్యర్థి మెజారిటీ అధికంగా ఉండటంతో వీటిని మినహాయించి ఫలితం ప్రకటించారు. పార్లమెంట్ అభ్యర్థికి నమోదైన ఓట్లు చూస్తే 185లో వైసీపీకి 168, టీడీపీ 435, 233లో వైసీపీకి 41, టీడీపీకి 1017 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో తెనాలి నియోజకవర్గంలో ఏడు బూత్‌లలో అధికార వైసీపీ ఇక్కడ డబుల్ డిజిట్‌కు పరిమితం కాగా కూటమి అభ్యర్థికి భారీగా ఓట్లు పోల్ అయ్యాయి. ఖాజీపేటలోని 3వ నెంబరు బూత్‌లో వైసీపీకి 17, కూటమికి 785 ఓట్లు, 4వ పోలింగ్ స్టేషన్‌లో వైసీపీకి 41, కూటమికి 766 ఓట్లు, నందివెలుగులోని 17వ పోలింగ్ స్టేషన్‌లో వైసీపీకి 78, కూటమికి 806, చక్రాయపాలెంలోని 224వ బూత్‌లో వైసీపీకి 36, కూటమికి 976 ఓట్లు, అత్తోటలోని 231వ బూత్‌లో వైసీపీకి 76, కూటమికి 562 ఓట్లు, 232వ బూత్‌లో వైసీపీకి 72, కూటమికి 637 ఓట్లు, 233వ బూత్‌లో వైసీకికి 93, కూటమికి 873 ఓట్లు లభించాయి.



పేద కుటుంబానికి నిత్యావసరాలను అందిస్తున్న యంగ్ జనరేషన్ సేవా సంస్థ సభ్యులు

పేద కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ

తెనాలి, మారీసుపేట జూన్ 5: స్థానిక చెంచుపేట అమరావతి ప్లాట్స్‌లో నివసిస్తున్న పేద కుటుంబానికి యంగ్ జనరేషన్ సేవా సంస్థ వారు నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. బుధవారం యంగ్ జనరేషన్ సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ సాదిక్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్న తాళ్సూరి రమేష్ కుటుంబానికి 25కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా సాదిక్ మాట్లాడుతూ తమ సంస్థ సభ్యుల, దాతల సహకారంతో పేదలకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సేవా సంస్థ సభ్యులు, సాదిక్ మిత్రబృందం పాల్గొన్నారు.

లోకేశ్ విజయం చారిత్రాత్మకం : ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్, జూన్ 5: మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విజయం చారిత్రాత్మకమని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. బుధవారం ఉండవల్లిలో నారా లోకేశ్‌ను కలిసిన ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అభినందనలు తెలియజేశారు. ఒకొరికొకరు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మంగళగిరలో 91,413 ఓట్ల రికార్డు మెజార్టీతో నారా లోకేశ్ గెలిచారని నరేంద్రకుమార్ అన్నారు. తన పట్టుదలతో మొక్కవోని దీక్షతో రికార్డు మెజార్టీ సాధించి నారా లోకేశ్ తెలుగుదేశం పార్టీకి స్ఫూర్తిగా నిలిచారని హర్షం వ్యక్తం చేశారు. లోకేశ్ విజయం భావి యువ తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఆదర్శంగా నిలుస్తుందని నరేంద్ర కుమార్ అన్నారు.

ఎమ్మెల్యే నాదెండ్లకు అభినందనల వెల్లువ

తెనాలి, మారీసుపేట జూన్ 5: జనసేన పీఏసీ ఛైర్మన్, టీడీపీ, బీజేపీ పార్టీల ఉమ్మడి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి అఖండ విజయాన్ని సాధించిన నాదెండ్ల మనోహర్‌ను వివిధ సంఘ నాయకులు, ప్రభుత్వ అధికారులు కలసి అభినందనలు తెలిపారు. స్థానిక బోసురోడ్డులోని జనసేనపార్టీ కార్యాలయంలో బుధవారం తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ శాసనసభ్యుడి విజయం సాధించిన నాదెండ్ల మనోహర్‌ను పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శిలు జి వెంకట శివరామకృష్ణ, అందె బాలచంద్రమౌళి, గొట్టిముక్కల సుబ్బారావులు కలసి దుశ్శాలవాతో సత్కరించి మెమెంటును అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ బిట్రా శ్రీనివాసరావు, మాచర్ల శ్రీనివాసమూర్తి, తారువీధుల రమేష్, జొన్నాదుల శ్రీనివాసరావు, కందుల శ్రీనివాసరావు, నాగప్రసాద్, ఆరికాటి బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలిపిన ప్రణీత్

తెనాలి రూరల్, జూన్ 5: మంగళగిరి నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలుపొందిన నారాలోకేశ్‌ను తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి పాలడుగు ప్రణీత్ హర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి విజయోత్సవ కేక్‌ను కట్‌చేసి స్వీట్లు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. పలువురు తెలుగు యువత నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తూ శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రణీత్

పోస్టల్ బ్యాలెట్‌లో టీడీపీకి ఆధిక్యం

తెనాలి అర్బన్, జూన్ 5: ప్రభుత్వ ఉద్యోగులంతా వైసీపీకి వ్యతిరేకం అంటున్న తరుణంలో మూడింట రెండు వంతులు కూటమి అభ్యర్థులకు, ఒక వంతు వైసీపీకి పోస్టల్ బ్యాలెట్ పడటం చర్చకు దారి తీసింది. దీనికి కారణం లేకపోలేదని ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి. ఉపాధ్యాయులు, పెన్షనర్లు, పీఆర్సీ కారణంగా హెచ్ఆర్ఏ, ఫిట్‌మెంట్ నష్టం, డీఏలు లేకపోవడం, పీఎఫ్ డబ్బులు రాకపోవడం, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ కాకపోవడం వంటి నష్టాన్ని గ్రహించారని, కానీ ప్రభుత్వ ఉద్యోగుల్లో ఈ ఆర్థిక నష్టం గుర్తించకపోవడంతో పాటు వైసీపీ హయాంలో నియమితులైన సచివాలయ ఉద్యోగులు, కొందరు అంగన్‌వాడీ వర్కర్లు వైసీపీకి మొగ్గు చూపడం వల్ల ఒక వంతు ఓట్లు ఆ పార్టీకి పడ్డాయని చెబుతున్నారు. మొత్తం మీద గతం కన్నా ఉద్యోగ వర్గాల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందనే మాట స్పష్టంగా వ్యక్తం అయ్యింది. గతంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 75శాతం వైసీపీకి, 25 శాతం మాత్రమే టీడీపీకి పడ్డాయి.

కొల్లిపర మండలంలో వైసీపీ మెజారిటీకి భారీ గండి

తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో కూటమికి ఆదరణ భారీగా లభించింది. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌కు పోస్టల్ బ్యాలెట్‌లతో కలిపి 48212 ఓట్లు మెజారిటీ లభించింది. వీటిలో పట్టణంలో 32,122, రూరల్ మండలంలో 15,123, పోస్టల్ బ్యాలెట్ 967 ఓట్లు ఉన్నాయి. ఎన్నో ఏళ్లుగా కొల్లిపర మండలంలో కాంగ్రెస్, వైసీపీకి లభిస్తున్న మెజారిటీ ఈ ఎన్నికల్లో భారీగా గండి పడింది. అక్కడ గతంలో వైసీపీ అభ్యర్థికి 9 వేలు వరకు మెజారిటీ లభించగా, ఈ ఎన్నికల్లో 2459కి పడిపోయింది. నియోజకవర్గంలో భారీ మెజారిటీకి ప్రభుత్వంపై వచ్చిన తీవ్ర వ్యతిరేకతతో పాటు పలు కారణాలను విశ్లేషిస్తున్నారు.

రాహుల్ పాదయాత్రతో కాంగ్రెస్‌కు పెరిగిన ఆదరణ

తెనాలి అర్బన్, జూన్ 5 : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ పాదయాత్ర కారణంగా దేశంలో కాంగ్రెస్ పట్ల ఆదరణ పెరిగిందని నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు చెప్పారు. మారీసుపేటలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడానికి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ముందుకు రావాలని తద్వారా రాష్ట్రానికి ప్రత్యేక హోదా, అభివృద్ధి చేకూరతాయని చెప్పారు. బీజేపీ పట్టు ఉన్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ పుంజుకుందని, తద్వారా అధికారానికి చేరువ అయ్యిందన్నారు. పార్టీ నాయకులు పొన్నూరు శశిధర్, కర్లపూడి బుల్లియ్య, ద్వారకా శీను, మాధవరావు, శివకుమార్, కోటేశ్వరరావు, అయ్యప్ప, సుబ్బారావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బందోబస్తు

పొన్నూరు టౌన్, జూన్ 5: ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోవటానికి ఆస్కారం ఇవ్వకుండా పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్న తెనాలి డీఎస్పీ ఎం రమేష్ తెలిపారు. బుధవారం పట్టణంలోని దఫ్‌పేట్‌లో పోలీస్ పికెటింగ్ డీఎస్పీ పరిశీలించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే రౌడీషీటర్లను బైండోవర్ చేశామన్నారు. అల్లర్లకు పాల్పడే వారిని గుర్తించి వారిపై నిఘా పెట్టినట్లు చెప్పారు. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పింటమే బాధ్యతగా తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ భాస్కర్, ఎస్ఐ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నూతక్కి అబ్రహం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావుమాదిగ, తదితరులు

మధురకవి నూతక్కి అబ్రహంకు ఘన నివాళి

తెనాలి రూరల్, జూన్ 5: కొలకలూరు గ్రామానికి చెందిన మధుర కవి నూతక్కి అబ్రహం 25వ వర్ధంతిని ఎమ్మార్పీఎస్, మాస్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఉన్నం ధర్మారావు మాదిగ పాల్గొని అబ్రహం చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెనాలిలో నూతనంగా నిర్మిస్తున్న ట్యాంక్ బండ్‌పై నూతక్కి అబ్రహం విగ్రహాన్ని ఏర్పాటు చేసేలా తెనాలి ఎమ్మెల్యే మనోహర్ చొరవ చూపాలన్నారు. పొన్నెకంటి చక్రవర్తి మాట్లాడుతూ గుర్రం జాషువా ప్రియ శిష్యుడిగా నూతక్కి అబ్రహం అనేక కవిత్వాలు రాశారన్నారు. కార్యక్రమంలో న్యాయవాది సుద్దపల్లి మురళీధర్, అంబేద్కర్, బవనాసి హేజెల్, మోదుకూరి దావీదు, ఉన్నం జానుబాబు, ఉన్నం చిన్నజాను, సీస్సీ, గోపి, ఇమ్మానుయేలు, నూతక్కి ఆచారి, స్వరాజ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.